మనసులో మాట

KANCHARLA

నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..

సంచలన తెలుగు దిన పత్రిక

KANCHARLA K TV NEWS

ప్రచురణ : విశాఖపట్నం -పబ్లిషర్ : కంచర్ల ఉపేంద్ర -సంపుటి : 2 -సంచిక : 81-శనివారం-28 నవంబర్ 2026-ఎడిటర్ : కంచర్ల అచ్యుతరావు- పేజీలు :8+16-వెల రూ.7/-

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం,తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ,గుంటురు,ప్రకాశం,తిరుపతి,నెల్లూరు,కర్నూలు,కడప,హైదరాబాద్

భారత్‌బంగ్లా సంబంధాల్లో హసీనా ముల్లు!

- హసీనాకు ఆశ్రయం ఇవ్వడంపై భారత్‌పై బంగ్లాదేశ్ అసహనం
- అప్పగింత ఒప్పందం ప్రకారం స్వదేశానికి రావాల్సిందే: బంగ్లా మంత్రి
- న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నాం: భారత విదేశాంగ శాఖ



4

బుల్లెట్ రైలు ట్రయల్‌కు సూరత్ సెక్షన్ సిద్ధం!

- 2027 మేలో 280 కి.మీ. వేగంతో పరీక్షించేందుకు ఏర్పాట్లు
- పూర్తయిన 50 కిలోమీటర్ల మార్గంలో విద్యుదీకరణ పనులు
- విమానాశ్రయాన్ని తలపించేలా సూరత్ రైల్వేస్టేషన్ నిర్మాణం



4

భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది

- ఇరుదేశాల దీర్ఘకాల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు
- 2026 సమ్మిట్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన
- ఈయూతో ఒప్పందం కూడా వచ్చే ఏడాది నుంచే అమలు
- అమెరికా ప్రతిపాదించిన 25 శాతం సుంకాల వేళ కీలక ప్రకటన



4



గుక్కెడు నీళ్లలో గుబులు..

- ప్లాస్టిక్ బాటిళ్లలో మైక్రోప్లాస్టిక్స్ కలకలం

గ్లాసుడు నీటిలో గరళం!

- బ్రాండెడ్ వాటర్‌పైనా నాణ్యత సందేహాలు
- అనుమతుల్లేకుండా పుట్టుకొస్తున్న ఆర్వో ప్లాంట్లు
- శుద్ధి పేరుతో ఖనిజాలు హరించుకుపోతున్నాయా?
- నీటి నాణ్యతపై నిఘా ఏదీ?..
- ప్రజారోగ్యంపై నిర్లక్ష్యమెందుకు?
- నీటి పరీక్షలేవీ?.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?
- క్యాన్ల నీటిలో కలుషితాల ముప్పు
- తాగునీటిపై అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

గుక్కెడు నీరు తాగాలన్నా గుబులే.. గ్లాసుడు నీటిలోనూ కలుషితాల కలకలమే! బ్రాండెడ్ బాటిళ్ల నుంచి వీధి చివరి వాటర్ క్యాన్ల వరకు నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్లాస్టిక్ బాటిళ్లలో మైక్రో, నానో ప్లాస్టిక్స్ ముప్పు పొంచి ఉండగా.. అనుమతుల్లేని ఆర్వో ప్లాంట్లు ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. శుద్ధి పేరుతో నీటిలోని సహజ ఖనిజాలు తొలగిపోతుండగా.. నీటి వృథా పర్యావరణానికి భారంగా మారుతోంది. నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మనం తాగే నీరు నిజంగా సురక్షితమేనా? అన్న ఆందోళన ప్రతి ఇంటినీ వెంటాడుతోంది!

(ఏపీ స్టేట్ బ్యూరో చీఫ్ - మనసులో మాట)

బ్రాండెడ్ బాటిళ్ల నుంచి వీధి చివరి వాటర్ క్యాన్ల వరకు నాణ్యతపై అనుమానాలు.. ప్లాస్టిక్ బాటిళ్లలో మైక్రో, నానో ప్లాస్టిక్స్ కలిసే ప్రమాదం.. అనుమతులు లేని ఆర్వో ప్లాంట్లతో ప్రజారోగ్యానికి ముప్పు.. శుద్ధి చేస్తున్నామనే పేరుతో నీటిలోని సహజ ఖనిజాలు తొలగిపోతున్నాయా?.. నీటి నాణ్యతను పర్యవేక్షించాల్సిన వ్యవస్థలపై ప్రశ్నలు.. తాగే నీటి విషయంలో ప్రతి ఒక్కరూ

మిగతా 2వ పేజీలో..

పల్లెపోరులో కూటమి ప్రభంజనం..

- తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుదారుల ఘన విజయం
- 2,539 స్థానాలతో కూటమి ఆధిక్యం.. టీడీపీదే పైచేయి
- 1,110 స్థానాలకే పరిమితమైన వైసీపీ
- కొన్ని కంచుకోటల్లో ఎదురుదెబ్బ.. మరికొన్ని చోట్ల పట్టు నిలుపుకున్న వైసీపీ
- అల్లూరిలో వైసీపీకి గట్టి పోటీ.. తిరుపతిలో మారిన రాజకీయ లెక్కలు
- 77.65 శాతం పోలింగ్‌తో పల్లెల్లో ఓటరు చైతన్యం
- 44 ఘటనలు.. మూడు పంచాయతీల్లో రీపోలింగ్
- రెండో, మూడో విడతలపై పార్టీల్లో పెరిగిన ఉత్కంఠ

ఏపీ స్టేట్ బ్యూరో చీఫ్, నవంబర్ 27 (మనసులో మాట)

ఆంధ్రప్రదేశ్ పల్లెల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా? గ్రామీణ ఓటరు నాడి ఎటువైపు ఉందో తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు స్పష్టమైన సంకేతాలిచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా కూటమి మద్దతుదారులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని ఆధిపత్యాన్ని చాటుకోగా, తెలుగుదేశం పార్టీ విజయాల్లో సింహభాగం దక్కించుకుంది. జనసేన, బీజేపీ మద్దతుదారులు సైతం గణనీయమైన విజయాలు

మిగతా 3వ పేజీలో..





ఏపీ అభివృద్ధికి చంద్రబాబు సర్కార్ మరో ముందడుగు..

- 30 ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్!
- పరిశ్రమలకు ప్రోత్సాహకాలు.. అమరావతి నిర్మాణాలకు అదనపు నిధులు
- కియా, అదానీ, సెయింట్ గోబైన్ పెట్టుబడులకు ఆమోదం
- ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం

2



ప్రాంతీయ సమతుల్యతకు హామీ ఇస్తే డీలిమిటేషన్‌కు వైసీపీ మద్దతు!

- జగన్ పార్టీ కీలక షరతు..
- ఎన్డీఏకు సంఖ్యాబలంలో అదనపు బలం

అమరావతి, నవంబర్ 27 (మనసులో మాట) :

డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లుపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక వైఖరిని వెల్లడించింది. ప్రాంతీయ సమతుల్యతకు హామీ ఇచ్చే

మిగతా 2వ పేజీలో..



రుషికొండ భవనాలకు పర్యాటక కళ!

- ఫైవ్‌స్టార్ హోటల్‌గా అభివృద్ధికి కేబినెట్ ఆమోదం..
- 40 రోజుల పాటు ప్రజల సందర్శనకు అవకాశం!

2

హస్తినలో మోదీతో చంద్రబాబు, పవన్ భేటీ..

- కూటమి వ్యూహంపై కీలక మంతనాలు!
- మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌పై ఎన్డీఏ భాగస్వాములతో చర్చలు..
- నాలుగు రోజుల పార్లమెంట్ సమావేశాలే లక్ష్యంగా ఢిల్లీ పర్యటన
- రాష్ట్ర ప్రయోజనాలు, పెండింగ్ ప్రాజెక్టులపైనా చర్చించే అవకాశం



3

చిక్కుల్లో తమిళనాడు సీఎం విజయ్..!



- గవర్నర్ నుంచి నివేదిక కోరిన అమిత్ షా...!
- ఆర్టికల్ 167(బి) కింద ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసులు..

కోస్తాంధ్ర బ్యూరో చీఫ్, మనసులో మాట

సార్వత్రిక ఎన్నికలకు ముందు తమిళనాడు సినీ నటుడు ప్రస్తుతం ముఖ్యమంత్రి విజయ్ నిర్వహించిన సభ లో తోక్కేసి లాటలో మృతి చెందిన 40 మంది మృతి చెందిన కేసులో ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అరెస్ట్

మిగతా 3వ పేజీలో..



జాతీయ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా బాలకృష్ణ

3

- సభ్యుడిగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ నియామకం

లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంపునకు కేంద్రం ప్రతిపాదన..



3

భలే మాట!



"మత్తులో మగ్గుతున్న యువత!"

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక



ప్రాంతీయ సమతుల్యతకు హామీ ఇస్తే డీలిమిటేషన్‌కు వైసీపీ మద్దతు!

మొదటిపేజీ తరవాయి

నిబంధనలతో బిల్లును ప్రవేశపెడితే కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని స్పష్టం చేసింది. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినేతృత్వంలోని పార్టీ ఈ మేరకు తన అభిప్రాయాన్ని వెల్లడించినట్లు ఏఎన్ఐ వార్తా సంస్థ శుక్రవారం పేర్కొంది. అయితే, ప్రాంతాల మధ్య ప్రాతినిధ్యంలో అసమానతలు తలెత్తకుండా చూడాలన్నది పార్టీ ప్రధాన షరతుగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్ ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ వైఖరి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును మరోసారి ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటన వెలువడింది. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ మద్దతు ప్రాధాన్యం సంతరించుకుంది. గత బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈ బిల్లుకు అవసరమైన మద్దతు లభించకపోవడంతో ప్రభుత్వం ముందడుగు వేయలేకపోయింది. ఇప్పుడు ప్రాంతీయ సమతుల్యతకు సంబంధించిన హామీలతో బిల్లును తీసుకొస్తే మద్దతు ఇస్తామన్న వైసీపీ ప్రకటన కేంద్రానికి రాజకీయంగా కీలకంగా మారింది. ఇదే సమయంలో శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) కూడా బిల్లుపై పూర్తిస్థాయి వ్యతిరేకత వ్యక్తం చేయడం లేదు. ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఇటీవల ఈ ప్రతిపాదనలో కొన్ని సానుకూల అంశాలు ఉండవచ్చని వ్యాఖ్యానించారు. కేవలం ప్రతిపక్షంలో ఉన్నామన్న కారణంతో బిల్లును గుడ్డిగా వ్యతిరేకించబోమని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. దీంతో డీలిమిటేషన్ అంశంపై విపక్ష పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

850కి లోక్‌సభ సభ్యుల సంఖ్య?*

ప్రతిపాదిత డీలిమిటేషన్ చర్యల్లో భాగంగా లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్యను ప్రస్తుత 550 నుంచి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, ఈ విస్తరణ వల్ల రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్యంలో అసమానతలు ఏర్పడకుండా చూడటం ప్రధాన అంశంగా మారింది. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ఎలాంటి ప్రభావం పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ సమతుల్యతకు హామీ ఇవ్వాలన్నవైసీపీ షరతు ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రత్యేక సమావేశాలకు కేంద్రం సన్నాహాలు*

మరోవైపు అత్యవసర ప్రభుత్వ కార్యకలాపాలను చేపట్టేందుకు పార్లమెంటు ఉభయ సభలను తిరిగి సమావేశపరచాలని కేంద్రం నిర్ణయించింది. నవంబర్ 30న లోక్‌సభను సమావేశపరచాలని స్పీకర్ ఓం బిర్లాను, డిసెంబర్ 2న రాజ్యసభను సమావేశపరచాలని ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్‌ను కోరినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గురువారం వెల్లడించారు. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుతో పాటు మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది. మొత్తంగా డీలిమిటేషన్ బిల్లుపై వైసీపీ విధించిన ప్రాంతీయ సమతుల్యత షరతు, ఇతర పార్టీల వైఖరులు, కేంద్రం ప్రతిపాదించే నిబంధనలు ఈ బిల్లు భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.



రుషికొండ భవనాలకు పర్యాటక కళ!

- **ఫైవ్‌స్టార్ హోటల్‌గా అభివృద్ధికి కేబినెట్ ఆమోదం..**
- **40 రోజుల పాటు ప్రజల సందర్శనకు అవకాశం!**

విశాఖపట్నం, నవంబర్ 27 (మనసులో మాట) :

విశాఖ నగరంలోని రుషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనాల భవిష్యత్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా రాజకీయ, న్యాయపరమైన చర్చలకు కేంద్రంగా ఉన్న ఈ భవనాలను పర్యాటక ఆదాయ వనరులుగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వీటిని ప్రభుత్వ కార్యాలయాలుగా వినియోగించకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫైవ్‌స్టార్ హోటల్ లేదా ప్రపంచస్థాయి పర్యాటక రిసార్ట్‌గా అభివృద్ధి చేయాలన్న కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రుషికొండ భవనాలను ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (నిర్వహణ, నిర్వహణ వ్యయం) ప్రాతిపదికన ప్రముఖ అంతర్జాతీయ హాస్పిటాలిటీ, టూరిజం సంస్థలకు లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రముఖ హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలను ఆహ్వానించే ప్రక్రియను చేపట్టింది. అర్హత కలిగిన సంస్థలను ఎంపిక చేసి, భవనాల నిర్వహణ బాధ్యతలను అప్పగించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలన్నది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.

ప్రైవేటు సంస్థలకు భవనాలను లీజుకు అప్పగించే ముందు సాధారణ ప్రజలకు వాటిని సందర్శించే అవకాశం కల్పించే అంశం కూడా తెరపైకి వచ్చింది. ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాల నిర్మాణ శైలి, అంతర్గత సదుపాయాలను ప్రజలు స్వయంగా చూసేందుకు వీలుగా సుమారు 40 రోజుల పాటు సందర్శనకు అనుమతించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనిపై పర్యాటక శాఖ త్వరలోనే అధికారిక మార్గదర్శకాలు, సందర్శన తేదీలు, వేళలను ప్రకటించే అవకాశం ఉంది. అయితే సందర్శనకు సంబంధించిన తుది నిర్ణయం, విధివిధానాలు అధికారిక ప్రకటన తర్వాతే స్పష్టతకు రానున్నాయి. రుషికొండ భవనాలను హోటల్ లేదా రిసార్ట్‌గా అభివృద్ధి చేయడంతో పాటు, కొండ దిగువన ఉన్న భూమిని కూడా పర్యాటక అవసరాలకు వినియోగించాలనే ప్రణాళిక ఉంది. సీఆర్‌జెడ్ (తీరప్రాంత నియంత్రణ మండలి), పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా అదనపు పర్యాటక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. సందర్శకులకు అవసరమైన వసతి, వినోదం, ఆతిథ్య సేవలను అంతర్జాతీయ ప్రమాణాలతో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా విశాఖ పర్యాటక రంగానికి కొత్త అవకాశాలు కల్పించాలన్నది ఈ ప్రణాళికలో భాగం. మరోవైపు రుషికొండపై గతంలో చేపట్టిన నిర్మాణాలపై పర్యావరణ, న్యాయపరమైన వివాదాలు ఇంకా ప్రాధాన్యత కలిగి ఉన్నాయి. నిర్మాణాల విషయంలో తీరప్రాంత నియంత్రణ మండలి నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని కేంద్ర నిపుణుల కమిటీ హైకోర్టుకు నివేదిక సమర్పించిన నేపథ్యంలో పర్యావరణ పునరుద్ధరణకు సంబంధించిన చర్యలు కూడా చేపట్టాల్సి ఉంది. ఈ అంశాలను పరిష్కరిస్తూనే భవనాల భవిష్యత్ వినియోగంపై ప్రభుత్వం ముందుకు సాగాల్సి ఉంటుంది.

గుక్కెడు నీళ్లలో గుబులు.. గ్లాసుడు నీటిలో గరళం!

మొదటిపేజీ తరువాయి

అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి! ప్రజారోగ్యానికి అత్యంత కీలకమైన తాగునీటి నాణ్యత ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు స్వచ్ఛమైన నీరు దొరికితే సరిపోయేది. ప్రస్తుతం ఆ నీరు ఎక్కడి నుంచి వస్తోంది? ఎలా శుద్ధి చేస్తున్నారు? ఏ పాత్రల్లో నిల్వ చేస్తున్నారు? ఎంతకాలం నిల్వ ఉంచుతున్నారు? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. పట్టణాలు, నగరాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిళ్లు, 20 లీటర్ల క్యాన్లు, ఇంటింటికీ సరఫరా అయ్యే ఆర్వో నీటిపై ప్రజలు ఆధారపడుతున్నారు. అయితే వీటన్నింటి నాణ్యత ఒకేలా ఉంటుందనే భరోసా లేదు. ప్రముఖ బ్రాండ్ల నీటి నమూనాలపై వెలువడుతున్న వివాదాలు, ప్లాస్టిక్ బాటిళ్లలో మైక్రో ప్లాస్టిక్స్ ఆనవాళ్లపై జరుగుతున్న పరిశోధనలు, అనధికారిక నీటి శుద్ధి కేంద్రాల విస్తరణ ప్రజల్లో ఆందోళన పెంచుతున్నాయి. ప్లాస్టిక్ బాటిళ్లలో నిల్వ చేసే నీటిలో మైక్రోప్లాస్టిక్స్, నానోప్లాస్టిక్స్ అనే అతి సూక్ష్మ కణాలు చేరే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా బాటిళ్లను ఎక్కువ ఉష్ణోగ్రతలకు, నేరుగా సూర్యరశ్మికి గురిచేయడం, పదేపదే ఉపయోగించడం వల్ల ఈ ముప్పు పెరిగే అవకాశముంది. ఈ సూక్ష్మ కణాలు మనిషి శరీరంలోకి చేరితే వాపు, ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటి జీవసంబంధిత మార్పులకు కారణమవుతాయా అనే అంశంపై పరిశోధనలు కొనసాగుతున్నాయి. అయితే మైక్రోప్లాస్టిక్స్ నేరుగా మానవుల్లో క్యాన్సర్‌కు కారణమవుతాయని నిర్ధారించేంత బలమైన ఆధారాలు ప్రస్తుతం లేవు. అందువల్ల భయాందోళనలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించడం అవసరం. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ అంటేనే పూర్తిగా సురక్షితమని భావించడం సరికాదనే చర్చ ఇటీవల దేశవ్యాప్తంగా మొదలైంది. బిస్లరీ వంటి ప్రముఖ బ్రాండ్‌కు చెందిన నీటి నమూనాల పరీక్షలు, బ్రోమేట్ పరిమితుల ఉల్లంఘన ఆరోపణలు, తదుపరి ప్రయోగశాల పరీక్షలపై వెలువడిన కథనాలు ప్యాకేజ్డ్ వాటర్ నాణ్యతను మరోసారి చర్చకు తెచ్చాయి. బ్రోమేట్ వంటి రసాయనాలు నిర్ణీత పరిమితులను మించితే ఆరోగ్యానికి హానికరమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు నకిలీ బ్రాండ్లు, ప్రముఖ కంపెనీల పేర్లను పోలిన లేబుళ్లతో విక్రయించే నీటి బాటిళ్లు వినియోగదారులను మోసగించే అవకాశం ఉంది. కాబట్టి బ్రాండ్ పేరు చూసి మాత్రమే నీటి భద్రతను నిర్ణయించకూడదు.

బిస్లరీ వివాదం.. ఒక్క బ్యాచ్‌పైనే చర్యలు

నవంబర్ 2026లో బిస్లరీకి చెందిన ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నమూనాపై ఎఫ్ఎస్ఎస్ఏఐ చర్యలకు అనుమతి ఇవ్వడం చర్చనీయాంశమైంది. గోవాలో తయారైన ఒక బ్యాచ్ నమూనాలో తొలుత బ్రోమేట్ పరిమితికి మించి ఉన్నట్లు గుర్తించగా, అప్పీల్ అనంతరం రిఫరల్ ల్యాబ్ పరీక్షల్లో పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ ఆనవాళ్లు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో చట్టపరమైన చర్యలకు అనుమతి లభించింది. అయితే ఈ వ్యవహారం మొత్తం బ్రాండ్ ఉత్పత్తులకు సంబంధించినది కాదు. ఒక నిర్దిష్ట బ్యాచ్‌కే పరిమితమని ఎఫ్ఎస్ఎస్ఏఐ స్పష్టం చేసింది. ఆ బ్యాచ్ విక్రయాలను నిషేధించినట్లు తెలిపింది. సంస్థ కూడా తదుపరి ప్రకటనలో వివాదాస్పద బ్యాచ్ మార్కెట్లో లేదని, పరీక్షల ఫలితాలపై తన అభ్యంతరాలను వెల్లడించింది. ఈ పరిణామం బ్రాండెడ్ నీటి నాణ్యతపై మరింత పర్యవేక్షణ అవసరాన్ని గుర్తుచేస్తోంది.

ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ రంగంలో కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మార్చింది. 2024 అక్టోబర్ 17 నుంచి ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌కు తప్పనిసరిగా ఉండాల్సిన బీఐఎస్ (BIS) ధ్రువీకరణ నిబంధనను తొలగించారు. అయితే నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఉండేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ 2024 నవంబర్ 29న ఈ రంగాన్ని హైరిస్క్ ఫుడ్ కేటగిరీలో చేర్చింది. ప్లాంట్లకు లైసెన్స్ ఇచ్చే ముందు తనిఖీలు, నిర్దిష్ట వ్యవధిలో అధికారుల పర్యవేక్షణ, వార్షిక థర్డ్‌పార్టీ ఆడిట్ వంటి నిబంధనలను అమల్లోకి తెచ్చింది. 2026 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పరీక్షల విధానం ప్రకారం ప్యాకేజ్డ్ వాటర్ తయారీ సంస్థలు సూక్ష్మజీవుల పరీక్షలను నెలవారీగా, నిర్దేశిత రసాయన పరీక్షలను మూడు నెలలకు ఒకసారి, పురుగుమందుల అవశేషాలు, భారలోహాలు తదితర పరీక్షలను ఆరు నెలలకు ఒకసారి నిర్వహించాలి. అంటే బీఐఎస్ మార్కు తప్పనిసరి కాకపోయినా ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు, లైసెన్సింగ్, నాణ్యత పరీక్షలు తప్పనిసరే.

వీధికో ఆర్వో ప్లాంట్..

నాణ్యతకు ఎవరు బాధ్యులు?

భూగర్భ జలాల కాలుష్యం, తాగునీటి కొరత, మున్సిపల్ నీటి సరఫరాపై అనిశ్చితి కారణంగా ఆర్వో ప్లాంట్లకు గిరాకీ పెరిగింది. పట్టణాలు, గ్రామాల్లో 20 లీటర్ల క్యాన్లతో నీటిని సరఫరా చేసే కేంద్రాలు విస్తరిస్తున్నాయి. అయితే ప్రతి ప్లాంట్‌లోనూ నీటి నాణ్యత పరీక్షలు జరుగుతున్నాయా? ఫిల్టర్లు, మెంబ్రేన్లు నిర్ణీత సమయంలో మారుస్తున్నారా? నిల్వ ట్యాంకులను శుభ్రం చేస్తున్నారా? క్యాన్లను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారుతోంది. కొన్ని కేంద్రాలు సరైన అనుమతులు, లైసెన్సులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు. ఫిల్టర్ల నిర్వహణ సరిగా లేకపోవడం, ట్యాంకుల్లో పేరుకుపోయే మలినాలు, అపరిశుభ్రమైన క్యాన్ల వినియోగం వల్ల నీటిలో బ్యాక్టీరియా చేరవచ్చు. నీటిలో రసాయన కాలుష్యాలు ఉన్నా, వాటిని గుర్తించకుండా కేవలం ఆర్వో యంత్రం ద్వారా శుద్ధి చేశామని విక్రయించడం సరికాదు.

ఆర్వో నీరే ఆరోగ్యకరమా?..

అతిశుద్ధితోనూ సమస్యలే!

నీటిలోని కరిగిన లవణాలు, కొన్ని భారలోహాలు, ఫ్లోరైడ్, నైట్రేట్లు వంటి కాలుష్యాలను తొలగించడంలో రివర్స్ ఆస్మోసిస్ (RO) సాంకేతికత ఉపయోగపడుతుంది. అయితే ప్రతి రకమైన నీటికి ఆర్వో అవసరం లేదు. నీటి అసలు నాణ్యతను పరీక్షించకుండా యంత్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఆర్వో ప్రక్రియలో నీటిలోని కాల్షియం, మెగ్నీషియం వంటి కొన్ని ఖనిజాలు కూడా తగ్గిపోవచ్చు. అందువల్ల అవసరానికి మించి శుద్ధి చేయడం, ఖనిజాల స్థాయిని పట్టించుకోకపోవడం మంచిది కాదు. అయితే నీటిలో టిడిఎస్ తక్కువగా ఉందంటే అది తప్పనిసరిగా ప్రమాదకరమని, లేదా ఎక్కువగా ఉందంటే కేవలం ఆర్వోతోనే సురక్షితమవుతుందని భావించకూడదు. టిడిఎస్ అనేది నీటిలో కరిగిన పదార్థాల మొత్తం స్థాయిని మాత్రమే సూచిస్తుంది. అందులో ఏ రసాయనాలు ఉన్నాయో, వాటి మోతాదు ఎంత ఉందో తెలుసుకోవడానికి ప్రత్యేక పరీక్షలు అవసరం. కేవలం టిడిఎస్ మీటర్ ఆధారంగా తాగునీటి భద్రతను నిర్ణయించడం సరికాదు.

ఆర్వోతో నీటి వృథా.. పర్యావరణానికీ భారమే!

ఆర్వో యంత్రాల వినియోగంలో మరో ప్రధాన సమస్య నీటి వృథా. శుద్ధి ప్రక్రియలో ఒక భాగం నీరు వినియోగానికి అనువుగా మారితే, మరో భాగం అధిక లవణాలతో కూడిన వ్యర్థ జలంగా బయటకు వస్తుంది. యంత్రం రకం, నీటి నాణ్యత, నిర్వహణను బట్టి ఈ వ్యర్థజల పరిమాణం మారుతుంది. కొన్ని వ్యవస్థల్లో శుద్ధి చేసిన నీటితో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు నీరు వృథా కావచ్చు. ఈ నీటిని తిరిగి ఉపయోగించుకోకుండా నేరుగా పదిలేస్తే నీటి వనరులపై మరింత ఒత్తిడి పడుతుంది. కాబట్టి ఆర్వో ప్లాంట్లలో వ్యర్థజలాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండాలి. నీటిని పొదుపుగా వినియోగించే సాంకేతికతను ప్రోత్సహించాలి.

ఏ నీరు తాగాలి?.. ఏ శుద్ధి పద్ధతి ఎంచుకోవాలి?

నీటి మూలం, అందులోని కాలుష్యాల ఆధారంగానే శుద్ధి పద్ధతిని నిర్ణయించుకోవాలి.

* మున్సిపల్ కుళాయి నీరు: సరఫరా చేసే నీరు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే, పైపులైన్లలో కలుషితం కాకుండా చూసుకోవాలి. సూక్ష్మజీవుల సమస్య ఉంటే మరిగించడం లేదా తగిన UV శుద్ధి ఉపయోగపడుతుంది.
* బోరు నీరు: ఫ్లోరైడ్, ఆర్సెనిక్, నైట్రేట్లు, లవణాలు వంటి అంశాల కోసం ప్రయోగశాలలో పరీక్ష చేయించాలి. ఫలితాల ఆధారంగా RO లేదా ఇతర తగిన శుద్ధి పద్ధతిని ఎంచుకోవాలి.
* మరిగించిన నీరు: నీటిలోని హానికరమైన సూక్ష్మజీవులను నాశనం చేయడంలో మరిగించడం ఉపయోగపడుతుంది. అయితే ఆర్సెనిక్, నైట్రేట్లు, ఇతర కరిగిన రసాయనాలను ఇది తొలగించలేదు.
* మినరల్ వాటర్: సహజంగా ఖనిజాలు కలిగిన నీరు, శుద్ధి చేసి ఖనిజాలను తిరిగి కలిపిన నీరు రెండూ ఒకటే కావు. లేబుల్‌పై ఉన్న వివరాలను పరిశీలించాలి.
* ఆర్వో నీరు: నీటి పరీక్షల ద్వారా అవసరం ఉన్నట్లు తేలినప్పుడు మాత్రమే ఉపయోగించాలి. అవసరమైతే తగిన మినరలైజేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

నీటిని నిల్వ చేసే పాత్రలపైనా దృష్టి పెట్టాలి

ప్లాస్టిక్ బాటిళ్లను ఎక్కువసేపు ఎండలో ఉంచడం, వేడికి గురిచేయడం, పదేపదే ఉపయోగించడం నివారించాలి. సాధ్యమైనంత వరకు శుభ్రమైన ఫుడ్‌గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ లేదా గాజు పాత్రల్లో నీటిని నిల్వ చేసుకోవాలి. మట్టి కుండలను ఉపయోగించినా వాటిని ప్రతిరోజూ శుభ్రం చేయాలి. రాగి పాత్రల్లో నీటిని నిల్వ చేయడం వల్ల అన్ని వ్యాధులూ నయమవుతాయనే ప్రచారాన్ని నమ్మకూడదు. పాత్ర శుభ్రత, నీటి మూలం, నిల్వ విధానం అన్నీ సమానంగా ముఖ్యం.

పర్యవేక్షణ బాధ్యత ఎవరిది?

తాగునీటి నాణ్యతను కాపాడటంలో పలు ప్రభుత్వ విభాగాలకు బాధ్యత ఉంది.

* ఎఫ్ఎస్ఎస్ఏఐ: ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ సంస్థల లైసెన్సులు, ఆహార భద్రతా ప్రమాణాలు, నాణ్యత పరీక్షల పర్యవేక్షణ.
* రాష్ట్ర ఆహార భద్రతా విభాగం: స్థానిక వాటర్ ప్లాంట్ల తనిఖీలు, నీటి నమూనాల సేకరణ, నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై చర్యలు.
* మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు: స్థానిక సంస్థల పరిధిలో అవసరమైన ట్రేడ్ లైసెన్సులు, పారిశుద్ధ్యం, వ్యాపార కార్యకలాపాల పర్యవేక్షణ.
* భూగర్భ జల శాఖ: వాణిజ్య అవసరాలకు భూగర్భ జలాల వినియోగానికి వర్తించే అనుమతులు, నిబంధనల అమలు.
* కాలుష్య నియంత్రణ మండలి: ప్లాంట్ల నుంచి వెలువడే వ్యర్థజలాలు, పర్యావరణ కాలుష్య నియంత్రణపై పర్యవేక్షణ.

ఈ విభాగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే అనధికారిక ప్లాంట్లకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు నాణ్యమైన నీటిని అందించడం సాధ్యమవుతుంది. క్యాన్ వాటర్ కొనేటప్పుడు క్యాన్‌పై ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా వర్తించే రిజిస్ట్రేషన్ వివరాలు ఉన్నాయో చూడాలి. తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, తయారీదారు వివరాలు పరిశీలించాలి. క్యాన్ మూత సీల్ దెబ్బతినకుండా ఉందో చూడాలి. పాతబడి, గీతలు పడి, రంగు మారిన క్యాన్లను తీసుకోకూడదు. ఎండలో ఎక్కువసేపు ఉంచిన ప్లాస్టిక్ బాటిళ్లను కొనకూడదు. అనుమానాస్పదంగా కనిపించే నీటి క్యాన్లను ఉపయోగించకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. ముఖ్యంగా టిడిఎస్ మీటర్‌తో అప్పుడప్పుడు నీటిని పరీక్షించుకోవడం ఉపయోగకరమే. అయితే టిడిఎస్ ఒక్కటే నీటి స్వచ్ఛతకు ధ్రువీకరణ కాదని గుర్తుంచుకోవాలి. తాగునీటిలో ఉండే కొన్ని రసాయనాలు దీర్ఘకాలం అధిక మోతాదులో శరీరంలోకి చేరితే ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది. ఆర్సెనిక్ వంటి కొన్ని కాలుష్యాలు దీర్ఘకాలికంగా క్యాన్సర్ ముప్పును పెంచుతాయని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి. అయితే ప్రతి కలుషిత నీటిని తాగినవారికి క్యాన్సర్ వస్తుందని భావించడం సరికాదు. ప్రమాదం అనేది కాలుష్య కారకం స్వభావం, దాని సాంద్రత, ఎంతకాలం దానికి గురయ్యామనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. మూత్రంలో రక్తం కనిపించడం, అరచేతులు లేదా అరికాళ్లపై చర్మం మందంగా మారడం, నల్లటి మచ్చలు ఏర్పడటం, కారణం తెలియకుండా బరువు తగ్గడం, మలవిసర్జన అలవాట్లలో దీర్ఘకాలిక మార్పులు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. ఇవి క్యాన్సర్‌కు మాత్రమే సంబంధించిన లక్షణాలు కావు. ఇతర వ్యాధుల వల్ల కూడా రావచ్చు. వైద్య పరీక్షల ద్వారా అసలు కారణాన్ని తెలుసుకోవాలి. నీటి నాణ్యత విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మార్డా సూచిస్తున్నారు. తాము తాగే నీటి మూలాన్ని ముందుగా తెలుసుకోవాలని, ముఖ్యంగా బోరు నీటిని గుర్తింపు పొందిన ప్రయోగశాలలో కనీసం ఏడాదికి ఒకసారి పరీక్షించుకోవాలని చెబుతున్నారు. నీటిలో ఏయే కాలుష్యాలు ఉన్నాయో గుర్తించిన తర్వాతే తగిన ఫిల్టర్‌ను ఎంచుకోవాలన్నారు. నీటిని మరిగించడం వల్ల సూక్ష్మజీవులు నశించినప్పటికీ ఆర్సెనిక్, నైట్రేట్లు వంటి రసాయనాలు తొలగిపోవని స్పష్టం చేస్తున్నారు. క్లోరినేషన్‌ను నిర్లక్ష్యం చేయకుండా, నీటి శుద్ధి ప్రమాణాలను పాటించాలని సూచిస్తున్నారు. గర్భిణులు, చిన్న పిల్లలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు తాగునీటి నాణ్యతపై మరింత శ్రద్ధ వహించాలన్నారు. ఖరీదైన బాటిల్ నీరు తాగుతున్నామంటే సంపూర్ణ భద్రత ఉన్నట్లు కాదు. ఇంటికి వచ్చే కుళాయి నీరు, బోరు నీరు, బయట కొనుగోలు చేసే క్యాన్ల నీరు.. ఏదైనా సరే దాని నాణ్యతే కీలకం. ఆర్వో పేరుతో ఏ నీటినైనా గుడ్డిగా తాగడం, టిడిఎస్ తక్కువగా ఉందని నీటిని అత్యుత్తమంగా భావించడం కూడా సరికాదు. నీటి మూలాన్ని తెలుసుకోవడం, అవసరమైన ప్రయోగశాల పరీక్షలు చేయించడం, కాలుష్యానికి అనుగుణంగా శుద్ధి చేయడం, పరిశుభ్రమైన పాత్రల్లో నిల్వ చేసుకోవడం ప్రతి కుటుంబం అలవాటు చేసుకోవాలి.

ఏపీ అభివృద్ధికి చంద్రబాబు సర్కార్ మరో ముందడుగు..

అమరావతి,నవంబర్ 27 (మనసులో మాట):



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడుల పెంపు, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సుమారు మూడు గంటలపాటు కొనసాగిన ఈ సమావేశంలో మొత్తం 30 అంశాలతో కూడిన అజెండాకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిశ్రమల స్థాపన నుంచి రాజధాని నిర్మాణం వరకు పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించి నిర్ణయాలు తీసుకుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం అందించే దిశగా ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు 2026కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ బిల్లు ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ఎదురయ్యే జాప్యాన్ని తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకొచ్చే దిశగా కియా, అదానీ, సెయింట్ గోబైన్ సహా ఆరు సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలకు ప్రోత్సాహకాలు కల్పించేందుకు ఆమోదం తెలిపింది. పెనుకొండలో కియా రెండో ఆటోమొబైల్ ప్లాంట్, శ్రీకాకుళంలో అదానీ టైటానియం కాంప్లెక్స్, అచ్యుతాపురంలో సెయింట్ గోబైన్ గాజు తయారీ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. ఈ పరిశ్రమలు అందుబాటులోకి వస్తే రాష్ట్ర పారిశ్రామిక రంగానికి మరింత బలం చేకూరడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి నిర్మాణాలకు సంబంధించి కూడా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయ నిర్మాణ వ్యయాన్ని రూ.6,641 కోట్లకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అలాగే రాజధాని గ్రామాల్లో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,215 కోట్ల విలువైన పనులకు సంబంధించి నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు, శాసనసభ భవనాల నిర్మాణ పురోగతి, శాఖమూరులో అమరావతి సంగమం అభివృద్ధి వంటి అంశాలపై కూడా చర్చించింది. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా కోసలనగరం పారిశ్రామిక పార్కు కోసం రూ.1,500 కోట్ల రుణం తీసుకునే ప్రతిపాదనకు, మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ రసాయన పరిశ్రమల పార్కు ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. మరోవైపు విద

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

పల్లెపోరులో కూటమి ప్రభంజనం..

మొదటిపేజీ తరువాయి

సాధించారు. మరోవైపు గత ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో బలమైన పునాదులు కలిగిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈసారి ఆశించిన స్థాయిలో ఫలితాలు దక్కలేదు. అయితే కొన్ని జిల్లాల్లో, ముఖ్యంగా వైసీపీకి పట్టున్న ప్రాంతాల్లో ఆ పార్టీ మద్దతుదారులు గట్టి పోటీ ఇచ్చారు. మరికొన్ని చోట్ల కూటమి ఆధిపత్యానికి సవాల్ విసిరారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే తరహా రాజకీయ తీర్పు కాకుండా ప్రాంతాలవారీగా భిన్నమైన ప్రజాభిప్రాయం వ్యక్తమైనట్లు ఫలితాలు విశ్లేషణలో వెల్లడవుతోంది. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 3,949 గ్రామ పంచాయతీలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టారు. వీటిలో 760 సర్పంచ్ స్థానాలు ముందుగానే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు నవంబర్ 26న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఓట్ల లెక్కింపు చేపట్టారు. నవంబర్ 27 ఉదయానికి దాదాపు అన్ని స్థానాల ఫలితాలు వెల్లడయ్యాయి. అందుబాటులో ఉన్న ఒక మీడియా సంస్థ గణాంకాల ప్రకారం కూటమి మద్దతుదారులు మొత్తం 2,539 స్థానాలను కైవసం చేసుకున్నారు. ఇందులో తెలుగుదేశం మద్దతుదారులు 2,325 స్థానాల్లో, జనసేన మద్దతుదారులు 189 స్థానాల్లో, బీజేపీ మద్దతుదారులు 25 స్థానాల్లో విజయం సాధించారు. వైసీపీ మద్దతుదారులు 1,110 స్థానాలను దక్కించుకోగా, ఇతరులు, స్వతంత్రులు 294 స్థానాల్లో గెలుపొందారు. ఈ గణాంకాలు కూటమికి స్పష్టమైన ఆధిక్యాన్ని సూచిస్తున్నాయి. ముఖ్యంగా టీడీపీ మద్దతుదారులు సాధించిన విజయాలు ఆ పార్టీ గ్రామస్థాయి బలాన్ని మరోసారి చాటుతున్నాయి. పోటీ జరిగిన స్థానాల్లోనే కాకుండా ఏకగ్రీవాల్లోనూ కూటమి మద్దతుదారుల ప్రభావం కనిపించింది. తొలి విడతలో ఏకగ్రీవమైన 760 సర్పంచ్ స్థానాల్లో 708 స్థానాలు కూటమి మద్దతుదారుల ఖాతాలోకి వెళ్లినట్లు కొన్ని మీడియా నివేదికలు వెల్లడించాయి. దీంతో పోలింగ్‌కు ముందే కూటమి గణనీయమైన ఆధిక్యాన్ని సాధించింది. మరోవైపు పలు గ్రామాల్లో స్థానిక నాయకుల మధ్య సయోధ్య, సామాజిక సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ ఏకగ్రీవాలకు దోహదపడ్డాయి. ఆచంట ప్రాంతంలో ఓ అభ్యర్థి తనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి సొంత నిధుల నుంచి రూ.2 కోట్లు కేటాయిస్తానని ప్రకటించడం ప్రత్యేక చర్చకు దారితీసింది. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నీ ఏకగ్రీవమైన పంచాయతీలకు ప్రభుత్వం రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహక నిధులు అందించే విధానం కూడా ఈ ఎన్నికల్లో ప్రస్తావనకు వచ్చింది.

రాష్ట్రవ్యాప్తంగా కూటమి ఆధిక్యం కనిపించినప్పటికీ కొన్ని జిల్లాల ఫలితాలు రాజకీయంగా ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో వైసీపీ తన పట్టును నిలబెట్టుకునే ప్రయత్నంలో ముందంజలో నిలిచింది. జిల్లాలో మొత్తం 66 పంచాయతీలకు గాను



వైసీపీ మద్దతుదారులు 29 చోట్ల విజయం సాధించగా, కూటమి మద్దతుదారులు 26 స్థానాలను దక్కించుకున్నారు. పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఆధిపత్యం ప్రదర్శించిన ఈ జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లోనూ ఆ పార్టీ తన ఉనికిని చాటుకుంది. ఇక తిరుపతి జిల్లాలో మాత్రం పరిషత్ ఎన్నికల ఫలితాలకు భిన్నమైన పరిస్థితి కనిపించింది. గతంలో పరిషత్ ఎన్నికల్లో కూటమి ఆధిపత్యం ప్రదర్శించిన ఈ జిల్లాలో 404 పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారులు మెజార్టీ స్థానాలు సాధించినట్లు నివేదికలు వెల్లడించాయి. టీడీపీకి బలమైన జిల్లాగా భావించే కృష్ణాలోనూ వైసీపీ గట్టి పోటీ ఇచ్చింది. గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ మద్దతుదారులు ఆధిక్యం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలోనూ ఆ పార్టీ తన బలాన్ని చాటుకుంది. మరోవైపు రాయలసీమ జిల్లాల్లో తిరుపతి మినహా మిగిలిన ప్రాంతాల్లో కూటమి మద్దతుదారుల ఆధిపత్యం కొనసాగింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత గ్రామమైన బలపనూరులోనూ టీడీపీ మద్దతుదారు విజయం సాధించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్ల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 25 జిల్లాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. మొత్తం 77.65 శాతం పోలింగ్ నమోదవడం గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల పట్ల ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. పోలింగ్ శాతంలో చిత్తూరు జిల్లా 83.37 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, విజయనగరం జిల్లా 83.33 శాతంతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. నంద్యాల జిల్లా 82.68 శాతం, శ్రీ సత్యసాయి జిల్లా 82.05 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. శ్రీకాకుళం జిల్లాలో అత్యల్పంగా 66.93 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధిక ఓటర్లు ఉన్న జిల్లాగా అనంతపురం నిలిచింది. ఇక్కడ 212 పంచాయతీల పరిధిలో 5,60,460 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా చిత్తూరు, విజయనగరం జిల్లాల్లో నమోదైన అధిక పోలింగ్ గ్రామీణ ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబించింది. తొలి విడత ఎన్నికలు మొత్తంగా ప్రశాంతంగా ముగిశాయని పోలీసు శాఖ ప్రకటించినప్పటికీ పలుచోట్ల చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో మొత్తం 44 ఎన్నికల సంబంధిత ఘటనలు నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం లండారిపుట్టుగలో ఇరు వర్గాల మధ్య రాళ్ల దాడి జరగగా, శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లెలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నంద్యాల జిల్లా అహోబిలంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ కాన్వాయ్‌లోని వాహనంపై దాడి జరిగినట్లు వార్తలు వచ్చాయి. కృష్ణా జిల్లా కేసరపల్లిలో టీడీపీ మద్దతుదారులు, రెబల్ అభ్యర్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం కూచిపూడిలో పోలీసులు స్వల్ప లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో బ్యాలెట్ బాక్సుల ధ్వంసం, బ్యాలెట్ పత్రాలు చించివేయడం, సిరా పోయడం వంటి ఘటనలు చోటుచేసుకోవడంతో మూడు పంచాయతీల్లో రీపోలింగ్ నిర్వహించాల్సి వచ్చింది.

పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు, శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లె మండలం నరసంపల్లి, గరికపాడు గ్రామాల్లో నవంబర్ 27న రీపోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనలు ఎన్నికల నిర్వహణలో భద్రత, పర్యవేక్షణ ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తు చేశాయి. తొలి విడత ఫలితాలతో ఇప్పుడు రాజకీయ పార్టీల దృష్టి రెండో విడత పంచాయతీ ఎన్నికలపై పడింది. నవంబర్ 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో సాధించిన విజయాలు కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, ఆశించిన ఫలితాలు రాని ప్రాంతాల్లో వైసీపీ నేతలు సమీక్షలకు సిద్ధమవుతున్నారు. గ్రామస్థాయిలో తమకు పట్టు తగ్గలేదని, అధికార పార్టీ అనేక ఇబ్బందులు కలిగించినా ప్రజలు తమకు అండగా నిలిచారని వైసీపీ నేతలు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కూటమి పాలనకు మద్దతు పలుకుతున్నారని కూటమి నాయకులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకపోవడంతో ఫలితాలను నేరుగా రాజకీయ పార్టీల విజయాలుగా పరిగణించడంపై కొంత జాగ్రత్త అవసరం. అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ, స్థానిక నాయకుల ప్రభావం, కుటుంబ నేపథ్యం, సామాజిక సమీకరణాలు, గ్రామస్థాయి సమస్యలు కూడా గెలుపోటములను ప్రభావితం చేశాయి. అయినప్పటికీ తొలి విడతలో కూటమి మద్దతుదారులు సాధించిన ఆధిక్యం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీ తన ఆధిపత్యాన్ని చాటుకోగా, జనసేన, బీజేపీ కూడా తమ ఉనికిని నిరూపించుకున్నాయి. వైసీపీకి కొన్ని ప్రాంతాల్లో లభించిన విజయాలు ఆ పార్టీకి ఆశలు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మిగిలిన రెండు విడతల ఎన్నికలు కూటమి, వైసీపీకి ప్రతిష్ఠాత్మకంగా మారాయి. తొలి విడతలో కనిపించిన ఆధిక్యాన్ని కూటమి కొనసాగిస్తుందా? లేక వైసీపీ పుంజుకుని కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

చిక్కుల్లో తమిళనాడు సీఎం విజయ్..!

మొదటిపేజీ తరవాయి

అయ్యే అవకాశం..? ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తమిళనాడు రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ లో పెరుగు తున్న ఆశలు...! చిగురిస్తున్నట్లు విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు. ఎందుచేతనంటే తిరుప్పరంకుండ్రం దీపారాధన వివాదం... ముదిరి ముదిరి పాకాల పడింది. ఇది కేవలం ఒక దీపం వెలిగించే విషయం మాత్రమే కాదు...! సాక్షాత్తూ భారత రాజ్యాంగానికే నిప్పు పెట్టినంత పని..! అయినట్లుగా భావిస్తున్నారు. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, జిల్లా కలెక్టర్‌ను సోడల్ అధికారిగా నియమించి నప్పటికీ, ఒక్కసారి కి మాత్రమే అనుమతి ఇచ్చినా అక్కడ దీపం వెలగలేదంటే...! దానికి పెట్టగలిగే ఒకే ఒక్క పేరు రాజ్యాంగ ఉల్లంఘన...!

అసలేం జరిగింది..?

నవంబర్ 24 వ తేది న తిరుప్పరంకుండ్రం కొండ పై ఉన్న దీపస్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించాలని నవంబర్ 20 వ తేది న సుప్రీం కోర్టు స్పష్టంగా ఆదేశించింది. ఇది ఒక్కసారికి మాత్రమే వర్తించే ఏర్పాటు అని పేర్కొంటూ, మధురై జిల్లా కలెక్టర్ నిశాంత్ కృష్ణను సోడల్ అధికారిగా కూడా నియమించింది.

కానీ నవంబర్ 24 వ తేది న దీపం వెలగలేదు..!

దానికి బదులుగా, సంప్రదాయబద్ధంగా వెలిగించే ఉచ్చి పిళ్ళయార్ ఆలయం వద్ద మాత్రమే దీపం వెలిగించారు. అసలైన దీపస్తంభం చీకట్లోనే ఉండి పోయింది. ఆ తర్వాత ప్రభుత్వం ఒక వితండ వాదంతో ముందుకొచ్చింది. ఆలయ ట్రస్టీ బోర్డు, దేవస్థానం అనుమతి ఇవ్వలేదు, అందుకే అమలు చేయలేక పోయాము అని..! ప్రభుత్వం తెలిపింది.

ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కంటే ఒక ట్రస్టీ బోర్డు గొప్పదా..? కోర్టు ఆదేశాలను అమలు చేయడానికి ఒక జిల్లా కలెక్టర్‌కు, ఒక రాష్ట్ర ప్రభుత్వానికి ట్రస్టీ అనుమతి అవసరమా..? భారత పరిపాలనా వ్యవస్థలో ఇదొక అతిపెద్ద వైఫల్యం..! గవర్నర్ ఎందుకు జోక్యం చేసుకున్నారు..? ఆర్టికల్ 167(బి) ప్రకంపనలు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నుంచి సమగ్ర నివేదికను కోరారు. రాష్ట్ర పరిపాలన కు, శాసన నిర్మాణానికి సంబంధించి గవర్నర్ కోరే ప్రతి సమాచారాన్ని ముఖ్యమంత్రి అందించాలని ఆర్టికల్ 167(బి) చెబుతోంది. అంటే, కోర్టు చెప్పినా మీరు ఎందుకు చేయలేదు..? మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారు..? మీరు ఏం చర్యలు తీసుకున్నారు...? అని గవర్నర్ ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. ఇది సాధారణ లేఖ కాదు...!రాజ్యాంగబద్ధమైన షోకాజ్ నోటీసు..! దీనికి సమాధానం ఇవ్వకుండా ముఖ్యమంత్రి తప్పించు కోలేరు. ఒకవేళ సమాధానం సంతృప్తికరంగా లేకపోతే, గవర్నర్ దానిని రాష్ట్రపతికి పంపవచ్చు. అసలు ఆట అక్కడే మారుతుంది..! ఇది మత వివాదం కాదు.. అధికారాని టెస్ట్ డోస్తి రుప్పరంకుండ్రం కొండకు ఒకవైపు సుబ్రహ్మణ్య స్వామి (మురుగన్) ఆలయం, మరోవైపు దర్గా ఆలయాలు ఉన్నాయి. దీపస్తంభం దర్గాకు సమీపంలో ఉంది. ఇక్కడ దీపం వెలిగించడానికి అనుమతి ఇస్తే, అది ఒక వర్గానికి వ్యతిరేకమనే ప్రచారం జరిగింది. ప్రభుత్వం ఆ ఉచ్చులో పడింది. మత సామరస్యం పేరుతో కోర్టు ఉత్తర్వులను పక్కన పెడితే, రేపు ఏ కోర్టు తీర్పునైనా ఇదే కారణంతో అడ్డుకోవచ్చు. అదే అసలైన ప్రమాదం..!ప్రభుత్వ నాటకమా

...?ట్రస్టీ ఒప్పు కోలేదని ప్రభుత్వం చెబుతోంది. అసలు ట్రస్టీ బోర్డును నియమించేది ఎవరు..? ప్రభుత్వమే కదా..! హిందూ మత ధర్మాదాయ శాఖ ప్రభుత్వం కిందే ఉంది కదా..! మరి ప్రభుత్వ శాఖే ప్రభుత్వ ఉత్తర్వుల ను అడ్డుకుందంటే ఎవరు నమ్ముతారు..? ఇదంతా ముందే వేసుకున్న నాటకమని అనుమానించడానికి అన్ని కారణాలు ఉన్నాయి. ట్రస్టీని కాదని కోర్టు ఆదేశాలను అమలు చేసే అధికారం కలెక్టర్‌కు ఉంది. కానీ కదలవద్దు అనే రాజకీయ ఆదేశాలు పై నుంచి వచ్చి ఉండవచ్చు.



విజయ్ ప్రభుత్వానికి తొలి అగ్నిపరీక్ష

టి.వి.కె (టీవీకే) ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఎంతో కాలం కాలేదు. ప్రమాణ స్వీకారోత్సవం నుంచే గవర్నర్‌తో విభేదాలు మొదలయ్యాయి. ఇప్పుడు మొదటి రాజ్యాంగ సంక్షోభం ఎదురైంది. ఒక పాలకుడిగా విజయ్ సామర్థ్యాన్ని ఢిల్లీ పరీక్షిస్తోంది. ఆయన కోర్టుకు కట్టుబడి ఉంటారా...? లేక ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కోర్టును ధిక్కరిస్తారా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఆయన రెండో మార్గాన్నే ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అందుకు ఆయన మూల్యం చెల్లించు కోక తప్పదు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా..గవర్నర్ వ్యూహం నవంబర్ మధ్యలో దీపావళి సమయం లో తమిళనాడులో 17 హత్యలు జరిగాయన్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ గవర్నర్ నుంచి శాంతి భద్రతల నివేదిక కోరింది. గవర్నర్ ఢిల్లీ వెళ్లి అమిత్ షాను నేరుగా కలిశారు. ఇప్పుడు దీపం వివాదంపై మరో నివేదిక. ఇదంతా యాదృచ్ఛికం కాదు..! ఈ రెండు నివేదికలు కలిస్తే అదొక బలమైన ఫైల్ అవుతుంది. ఆ ఫైల్ రాష్ట్రపతి భవన్‌కు చేరితే, అది ఆర్టికల్ 356 (రాష్ట్రపతి పాలన) దిశగా తొలి అడుగు అవుతుంది. ఇప్పుడు 356 లేకపోయినా, దానికి కావాల్సిన రంగం సిద్ధమవుతోంది. సుప్రీంకోర్టు సహనాన్ని పరీక్షించవద్దు. క్షమాపణ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు ఏం చేస్తుందనేది ఇప్పుడు కీలకం. కోర్టు ధిక్కరణ అనేది క్షమాపణ చెబితే ముగిసిపోయే నేరం కాదు. పోలీసు బలగాలను ఉపయోగించి దీపం ఎందుకు వెలిగించలేదు..? ట్రస్టీని ఎందుకు అరెస్ట్ చేయలేదు..? అని కోర్టు ప్రశ్నిస్తుంది. దీనికి సరైన సమాధానం లేకపోతే చీఫ్ సెక్రటరీ, కలెక్టర్‌లపై కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవు. అది ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిది...!

రాష్ట్రపతి పాలన వస్తుందా...? వాస్తవం ఏమిటంటే..

ప్రస్తుతానికి రాదు.. అదే నిజం! ఆర్టికల్ 356 విధించడం అంత సులభం కాదు. ఎస్.ఆర్. బొమ్మై కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లుగా రాష్ట్రం లో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా కుప్పకూలిందని నిరూపించాలి. కేవలం ఒక దీపం వెలిగించలేదన్న కారణంతో ప్రభుత్వాన్ని రద్దు చేయలేరు,

కోర్టు కూడా అంగీకరించదు.

కానీ...అసలు ముప్పు వేరే ఉంది.తమిళనాడు ముఖ్యమంత్రి తలపై ఒక డమోక్లిస్ కత్తి వేలాడుతోంది. 2025 సెప్టెంబర్ 27 వ తేది న తమిళనాడు లోని కరూర్‌లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) నిర్వహించిన రాజకీయ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట లో 41 మంది మరణించిన ఘటనపై ప్రస్తుతం సిబిఐ విచారణ జరుగుతోంది. నిర్వాహకుల వైపు నుంచి లేదా విజయ్ వైపు నుంచి తీవ్రమైన నిర్లక్ష్యం జరిగిందని సీ బీ ఐ నివేదిక ఇస్తే...అంతటితో కథ ముగిసినట్లే. సీఎం విజయ్ జైలుకు వెళ్లాల్సి వస్తుంది..!

గవర్నర్ ఇప్పుడు అడిగింది కేవలం ఒక నివేదిక మాత్రమే కాదు. మీరు రాజ్యాంగాని కి కట్టుబడి ఉంటారా...? లేదా..? అని సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ఆ ప్రశ్నకు విజయ్ ఇచ్చే సమాధానమే తమిళనాడు తదుపరి రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.దీపాన్ని ఆర్పినవారు ఒక విషయం గుర్తుంచుకోండి...! నిప్పు ఎప్పుడూ చీకటి నుంచే పుడుతుంది

హస్తినలో మోదీతో చంద్రబాబు, పవన్ భేటీ..

అమరావతి, నవంబర్ 27
(మనసులో మాట) :

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హుటాహుటిన హస్తినకు పయనమయ్యారు. అమరావతిలో వర్చువల్‌గా నిర్వహించిన కేబినెట్ సమావేశం ముగిసిన వెంటనే ఇద్దరు నేతలు ఢిల్లీ బయలుదేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని మోదీతో జరగనున్న ఈ భేటీలో జాతీయ రాజకీయ పరిణామాలతో పాటు రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశముండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. నవంబర్ 30 నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. పార్లమెంటు ఉభయ సభల్లో చర్చకు రానున్న కీలక బిల్లులు, ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ అమలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రధాని మోదీ ఈ సమావేశానికి ఆహ్వానించినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ అంశాలపై కూటమి పక్షాల మధ్య ఏకాభిప్రాయం సాధించడం, పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయడం ప్రధాన ఎజెండాగా ఉండవచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చగల అంశాల్లో నియోజకవర్గాల పునర్విభజన ఒకటి. ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే అంశంపై కేంద్రం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న స్థానాలకు అదనంగా సుమారు 50 శాతం మేర పెంపు ప్రతిపాదనపై చర్చ జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ నిర్ణయం అమలులోకి వస్తే రాష్ట్రాలవారీగా పార్లమెంటు స్థానాల సంఖ్య, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రాంతీయ సమతుల్యతలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ తరపున చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎలాంటి అభిప్రాయాలు వెల్లడిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. జాతీయ స్థాయి అంశాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన కేంద్ర నిధులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులు, రాష్ట్రానికి సంబంధించిన కీలక హామీల అమలుపైనా ఈ పర్యటనలో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు వంటి అంశాల్లో కేంద్రం నుంచి మరింత సహకారం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించే అవకాశం ఉంది. ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి ప్రధాని మోదీతో భేటీ కానుండటం రాష్ట్ర రాజకీయాల్లోనూ ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి భాగస్వామ్య పార్టీల మద్దతు కీలకంగా ఉన్న నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభిప్రాయాలకు ప్రాధాన్యత ఉండనుంది. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వైఖరి, కీలక బిల్లులపై మద్దతు, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలపై ఈ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా మోదీ ఆహ్వానంతో సాగుతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన కేవలం మర్యాదపూర్వక భేటీగానే కాకుండా జాతీయ రాజకీయాలు, ఎన్డీఏ కూటమి వ్యూహం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అంశాలకు కీలక వేదికగా మారుతుందా అన్నది వేచి చూడాలి.

లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంపునకు కేంద్రం ప్రతిపాదన..

- **2051 వరకు డీలిమిటేషన్ ఫ్రీజ్!**

విజయవాడ, (మనసులో మాట)
నవంబర్, 27,

దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసేలా కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ అంశంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతంతో పోలిస్తే 50 శాతం పెంచడంతో పాటు, రాష్ట్రాల మధ్య స్థానాల నిష్పత్తిని నిర్ణయించేందుకు 1971 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా కొనసాగించే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఈ విధానాన్ని 2051 వరకు పొడిగించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రతిపాదిత రాజ్యాంగ 131వ సవరణ బిల్లు ద్వారా లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్యను 850కి పెంచాలని కేంద్రం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో రాష్ట్రాలకు 815, కేంద్రపాలిత ప్రాంతాలకు 35 స్థానాలు కేటాయించే ప్రతిపాదన ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న స్థానాలతో పోలిస్తే అన్ని రాష్ట్రాల్లోనూ 50 శాతం స్థానాలను పెంచాలన్నది ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. డీలిమిటేషన్ అంటే జనాభా ప్రాతిపదికన లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను పునర్విభజించడం, స్థానాల సంఖ్యను నిర్ణయించడం. ఈ ప్రక్రియ ద్వారా జనాభాకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యాన్ని కల్పించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల కేటాయింపుల్లోనూ మార్పులు చేపడతారు.

డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు భవిష్యత్తులో లోక్‌సభ స్థానాల కేటాయింపులో అన్యాయం జరగకూడదన్నది వాటి ప్రధాన డిమాండ్. ఈ నేపథ్యంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల మధ్య స్థానాల నిష్పత్తిని కొనసాగిస్తూ, అన్ని రాష్ట్రాల్లో 50 శాతం స్థానాలను పెంచాలనే ప్రతిపాదనకు ప్రాధాన్యం ఏర్పడింది. మరోవైపు మహిళా రిజర్వేషన్ అమలు కూడా డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపడి ఉంది. మహిళలకు పార్లమెంట్‌లో రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, రాష్ట్రాల మధ్య రాజకీయ ప్రాతినిధ్యంలో సమతుల్యతను కాపాడటం కేంద్రానికి కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు లోక్‌సభ సచివాలయం ప్రకటించింది. నవంబర్ 30న లోక్‌సభ, డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఏ బిల్లులను ప్రవేశపెడతారనే అంశంపై కేంద్ర ప్రభుత్వం అధికారికంగా స్పష్టత ఇవ్వలేదు. కేంద్రం ప్రతిపాదనలపై అధికారిక ప్రకటన వెలువడితే దేశ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం, భవిష్యత్తు ఎన్నికల రాజకీయాలపై ఈ నిర్ణయాల ప్రభావం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

జాతీయ అవార్డుల జ్యూరీ ఛైర్మన్‌గా బాలకృష్ణ

అమరావతి, నవంబర్ 27
(మనసులో మాట) ::

2025 సంవత్సరానికి సంబంధించిన జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపిక ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అవార్డుల ఎంపిక కోసం ప్రత్యేక జ్యూరీ కమిటీని ఏర్పాటు చేస్తూ, దానికి ఛైర్మన్‌గా ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను నియమించింది. ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు సినిమాటోగ్రాఫర్, దర్శకుడు ఎస్.గోపాల్ రెడ్డి, సీనియర్ నటి ప్రభలను కమిటీ సభ్యులుగా నియమించింది. జాతీయ స్థాయి చలన

మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక



ఎంఎస్ఎంఈలకు అండగా ఏఐ... అందిపుచ్చుకోవడమే ఆలస్యం!

కృత్రిమ మేధ(ఏఐ) నేడు అన్ని రంగాలకూ శరవేగంగా విస్తరిస్తోంది. దేశార్థిక వ్యవస్థకు జీవనాడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లకూ సవాలు విసురుతోంది. అవగాహన లేకపోవడానికి తోడు ఆర్థిక వనరులు, సాంకేతిక నైపుణ్యాల కొరత వల్ల ఏఐని అందిపుచ్చుకోవడంలో ఎంఎస్ఎంఈలు వెనకబడుతున్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. ఈ నేపథ్యంలో చిన్నసంస్థలు తమ రోజువారీ కార్యకలాపాల్లో ఏఐని ఎలా ఉపయోగించుకోవచ్చన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది.

ఏఐ తొలి దశ ఎంఎస్ఎంఈలకు అందుబాటులో లేకపోయినా జెనరేటివ్ ఏఐ(జెన్ఏఐ), ఏజెంటిక్ ఏఐలు పరిస్థితిలో మార్పు తెస్తున్నాయి. చాట్జీపీటీ వంటి జనరేటివ్ ఏఐ సాధనాలు సమాచారాన్ని, చిత్రాలను సృష్టించడంలోనూ, క్లాడ్ ఏజెంట్స్ వంటి ఏజెంటిక్ ఏఐ సాధనాలు రిమైండర్లు పంపడం, రికార్డులను నవీకరించడం వంటి పనుల్లో సాయపడతాయి. ఈ రెండు రకాల ఏఐ సాధనాలను ఉచితంగా పరీక్షించుకునే అవకాశం ఉంది. అలాగే, లైసెన్స్తో కూడిన వాడకానికి నెలకు రూ.400 నుంచి తగిన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి.

వ్యాపారాల వృద్ధి కోసం...

ఉదాహరణకు మామిడి రైతులు జనరేటివ్ ఏఐ సాయంతో పురుగుమందుల పిచికారీ, ఎరువుల వినియోగం, కొమ్మల కత్తిరింపు వంటి పనులకు సంబంధించిన తనిఖీ జాబితాను తయారుచేసి, కూలీలతో పంచుకోవచ్చు. ఏజెంటిక్ ఏఐ సాయంతో తోటలోని ఒక ఆకును ఫొటోతీసి, ఇమేజ్ రికగ్నిషన్ యాప్ ద్వారా ఆకులోని సాధారణ సమస్యలను గుర్తించవచ్చు. మందు పిచికారీ తేదీలను షెడ్యూల్ చేసుకుని, ఫోన్లో రిమైండర్ వచ్చేలా చేసుకోవచ్చు. పంట కోత సమయంలో జెన్ఏఐ సాయంతో పండ్ల నాణ్యతా శ్రేణులు, ధరలు... ఏ కొనుగోలుదారు ఎన్ని క్రేట్ల మామిడిని ఆర్డర్ చేశారు, ఎప్పుడు చెల్లింపు చేశారు వంటి వివరాలనూ నమోదు చేసుకోవచ్చు. అలాగే ఓ చిన్న చేనేత యూనిట్ ఏజెంటిక్ ఏఐ ద్వారా ప్రతి ఆర్డర్ను ప్రతి దశలోనూ పర్యవేక్షించవచ్చు. జనరేటివ్ ఏఐ సాధనం ప్రతి కొత్త డిజైన్ కోసం కొటేషన్, ఉత్పత్తి వివరణను రూపొందించగలదు, కాబట్టి యజమాని రాతపని సమయాన్ని తగ్గించుకుని, ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టడానికి అవకాశం కలుగుతుంది.

రవాణా, ఆరోగ్య సంరక్షణ, ఆహారం, సేవలు వంటి రంగాల్లోనూ ఎంఎస్ఎంఈలు ఏఐ తోడ్పాటుతో తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోగలవు. మరింత మెరుగైన ఉత్పత్తులు, సేవలు అందించగలవు. ఏఐ సాధనాలను వాడుతున్న మహిళా స్వయంసహాయక సంఘాలు తక్కువ మందితోనే ఎక్కువ పనిని సమర్థంగా నిర్వహిస్తున్నాయి. అయితే, ఏఐ అనేది యజమానికి వ్యాపారం గురించి ఉన్న అవగాహనకు ప్రత్యామ్నాయం కాదు. జనరేటివ్ ఏఐ రాయడం, రూపకల్పన చేయడం వంటి పనులను నిర్వహిస్తే, ఏజెంటిక్ ఏఐ పదేపదే చేయాల్సిన లెక్కలు, రికార్డుల నిర్వహణ, రిమైండర్లు పంపడం వంటి పనులను చేయగలదు. దీంతో చెల్లింపుల కోసం ఫాలోఅప్ చేయడం, వినియోగదారుల సందేహాలను తీర్చడం, బిల్లుల తయారీ వంటి పునరావృతమయ్యే పనుల నుంచి యజమానులు, సిబ్బందికి విముక్తి కలుగుతుంది. తద్వారా వారు అమ్మకాలు, వినియోగదారులతో సంబంధాలపై దృష్టి పెట్టగలుగుతారు. ఫలితంగా, మరిన్ని ఆర్డర్లు పొందడానికి, కొత్త మార్కెట్లను చేరుకోవడానికి, అదనపు ఖర్చులు పెరగకుండానే అదే వేగంతో వృద్ధిని కొనసాగించడానికి వీలవుతుంది.

వ్యాపార ప్రక్రియలో ఒకేసారి ఏఐని అమలు చేయడానికి బదులు పాక్షికంగా ప్రయత్నించవచ్చు. వివరాల నమోదు వంటి ప్రాథమిక అవసరాలకు ముందుగా దాన్ని వాడవచ్చు. ఎక్కువ సమయం తీసుకునే, ఎక్కువ తప్పులకు దారితీసే పనులను ఏఐకి అప్పగించవచ్చు. ఇప్పటికే పలు అకౌంటింగ్, ఈమెయిల్ ప్లాట్ఫారాలు ఏఐ సాధనాల సహితంగా సేవలందిస్తున్నాయి. వాటిని పూర్తిగా వాడుకోవాలి. అమ్మకాల రికార్డులు, కస్టమర్ వివరాలు, ఇన్వెంటరీ లాగ్స్ వంటివాటిని సాధారణ స్ప్రెడ్షీట్ల రూపంలోగానీ, డిజిటల్ రూపంలోగానీ భద్రపరచడం అవసరం. స్థిరమైన రికార్డులు ఉంటే, తర్వాత విశ్లేషణ సాధనాల వాడకం సులభమవుతుంది. ఏఐకి సంబంధించి కేవలం సాధనాలు సమకూర్చుకోవడమే కాకుండా, వాడుకలో ప్రాథమిక అంశాలపై పట్టు సంపాదించడం మంచిది. ప్రస్తుతం అనేక ఆన్లైన్ డిజిటల్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్లు అందుబాటులో ఉన్నాయి. ఏఐ విక్రేతలను, కన్సల్టెంట్లను జాగ్రత్తగా ఎంచుకోవాలి. అంతేకాదు, ప్రతి ప్రక్రియలో మానవ ప్రమేయం ఉండేలా చూసుకోవడం మేలు. ఒక చిన్న తప్పు పెద్ద నష్టాన్ని కలిగించవచ్చు. అందుకని పూర్తిగా ఏఐ మీదే ఆధారపడకుండా కస్టమర్లకు, నియంత్రణ సంస్థలకు లేదా ఉద్యోగులకు చేరే ఏ విషయాన్ని అయినా బాధ్యతగల వ్యక్తి తనిఖీ చేసే పద్ధతిని పాటించాలి.

డాక్టర్ కంచర్ల
అచ్యుతరావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక



భారత్అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది

- ఇరుదేశాల దీర్ఘకాల సమస్యలు పరిష్కార దిశగా అడుగులు
- 2026 సమ్మిట్లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రకటన
- ఈయూతో ఒప్పందం కూడా వచ్చే ఏడాది నుంచే అమలు
- అమెరికా ప్రతిపాదించిన 25 శాతం సుంకాల వేళ కీలక ప్రకటన

నేషనల్ బ్యూరో, మనసులో మాట

భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. ఒప్పంద విధివిధానాలు, అమలు ప్రక్రియలో ఇన్నాళ్లూ ఎదురైన అడ్డంకులు తొలగిపోతున్నాయని చెప్పారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన 'ఇండియా డెట్ క్యాపిటల్ మార్కెట్ సమ్మిట్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఇరు దేశాల మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం అతి త్వరలోనే ఒక కొలిక్కి రానుందని గోయల్ స్పష్టం చేశారు. చర్చల్లో కీలకమైన ముందడుగు పడిందని తెలిపారు. ఇరు దేశాల ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం సిద్ధమవుతోందని వివరించారు.

భారత ఆర్థిక ప్రగతిని గోయల్ కొనియాడారు. జీఎస్టీ వ్యవస్థను సులభతరం చేస్తూనే పన్ను రేట్లను అందుబాటులో ఉంచామని గుర్తుచేశారు. ఇటీవల జీఎస్టీ వసూళ్లు ఆల్టైమ్ రికార్డును నమోదు చేశాయని చెప్పారు. ఒకే నెలలో ఎగుమతులు 90 బిలియన్ డాలర్లకు చేరడం దేశ చరిత్రలోనే ఓ మైలురాయి అని పేర్కొన్నారు.



యూరోపియన్ యూనియన్తో కూడా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగింపునకు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి యూరోపియన్ యూనియన్ ఒప్పందం ఖరారవుతుందని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్ నాటికి అది అమల్లోకి వచ్చే అవకాశముందని అంచనా వేశారు. ఈ ఒప్పందాల ద్వారా భారతీయ ఎగుమతిదారులకు అంతర్జాతీయ మార్కెట్లలో భారీ అవకాశాలు దక్కుతాయని ధీమా వ్యక్తం చేశారు.

భారత వస్తువులపై 25 శాతం వరకు సుంకాలు విధించాలని అమెరికా వాణిజ్య విభాగం ఇటీవల ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరితే ఆ సుంకాలను 17 శాతానికి తగ్గించే అవకాశం ఉందని అమెరికా సంకేతాలిచ్చింది. భారత్ తయారీ రంగంలో మితిమీరిన సామర్థ్యం ఉందన్న ఆరోపణలను కేంద్రం ఇప్పటికే తోసిపుచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొలి ఏడు నెలల్లో అమెరికాకు భారత ఎగుమతులు 59.52 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇప్పటికీ అమెరికానే భారత్కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్గా కొనసాగుతోంది.

బుల్లెట్ రైలు ట్రయల్కు సూరత్ సెక్షన్ సిద్ధం!

- 2027 మేలో 280 కి.మీ. వేగంతో పరీక్షించేందుకు ఏర్పాట్లు
- పూర్తయిన 50 కిలోమీటర్ల మార్గంలో విద్యుదీకరణ పనులు
- విమానాశ్రయాన్ని తలపించేలా సూరత్ రైల్వేస్టేషన్ నిర్మాణం

తెలంగాణ బ్యూరో, జాతీయం, మనసులో మాట
నవంబర్ 27 :

ముంబయిఅహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ హైస్పీడ్ రైలు మార్గంలో భాగంగా 50 కిలోమీటర్ల పొడవైన సూరత్బిలిమోరా సెక్షన్ ట్రయల్ రన్కు సిద్ధమవుతోంది. 2027 మేలో ఈ మార్గంలో ప్రయోగాత్మకంగా రైలును నడిపేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఈ సెక్షన్లో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. పరీక్షల్లో భాగంగా గంటకు 280 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ రైలును నడపనున్నారు.

మరోవైపు, నిర్మాణంలో ఉన్న సూరత్ బుల్లెట్ రైల్వేస్టేషన్ చిత్రాలను నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ విడుదల చేసింది. విమానాశ్రయాన్ని తలపించేలా అత్యాధునిక సౌకర్యాలతో స్టేషన్ను తీర్చిదిద్దుతున్నారు. ఆకట్టుకునే అంతర్గత అలంకరణ, ప్రత్యేక సీలింగ్, ఎస్కలేటర్లు, కేంద్రికృత శీతలీకరణ వ్యవస్థతో ఈ స్టేషన్ రూపుదిద్దుకుంటోంది.



భారత్-బంగ్లా సంబంధాల్లో హసీనా ముల్లు!

- హసీనాకు ఆశ్రయం ఇవ్వడంపై భారత్పై బంగ్లాదేశ్ అసహనం
- అప్పగింత ఒప్పందం ప్రకారం స్వదేశానికి రావాల్సిందే: బంగ్లా మంత్రి
- న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నాం: భారత విదేశాంగ శాఖ

తెలంగాణ బ్యూరో, జాతీయం, మనసులో మాట
నవంబర్ 27 :

భారత్బంగ్లాదేశ్ మధ్య దౌత్య సంబంధాల్లో మాజీ ప్రధాని షేక్ హసీనా వ్యవహారం ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ఆమెకు భారత్ ఆశ్రయం కల్పించడం ద్వైపాక్షిక సంబంధాలపై ఒత్తిడి పెంచుతోందని బంగ్లాదేశ్ వ్యాఖ్యానించింది. హసీనా ఇరుదేశాల సంబంధాల్లో ఓ ముల్లులా మారారని ఆ దేశ విదేశాంగ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ పేర్కొన్నారు. ఆమెను స్వదేశానికి పంపించలేక, ఆశ్రయం కల్పించడాన్ని సమర్థించుకోలేక భారత్ ఇబ్బందులు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు. హసీనా ఓ నేరస్థురాలని, ఇరుదేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం ఆమె బంగ్లాదేశ్కు తిరిగి రావాల్సి ఉంటుందని కబీర్ అన్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆమె స్వదేశానికి చేరుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రోవైపు, హసీనా స్వయంగా బంగ్లాదేశ్కు వెళ్లాలనుకోవడం, ఆమె అప్పగింతపై బంగ్లా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి రెండింటినీ వేర్వేరుగా చూస్తున్నామని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ స్పష్టం చేశారు. అప్పగింతకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.



లోక్సభలో సీట్లు పెరిగితే ఖర్చుల సంగతేంటి? పూర్తి లెక్కలివే!

నేషనల్ బ్యూరో, మనసులో మాట

నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం ఇప్పుడు దేశంలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. లోక్సభలో ఎంపీల సంఖ్యను ప్రస్తుత 543 నుంచి సుమారు 815కు పెంచే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 50 శాతం సీట్ల పెంపు నమూనాను ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. అయితే ఎంపీల సంఖ్య పెరగడం అంటే పార్లమెంట్లో సీట్లు పెంచడమే కాదు.. వారి జీతాలు, భత్యాలు, వసతి, కార్యాలయాలు, సిబ్బంది, ప్రయాణ సౌకర్యాల కోసం ప్రభుత్వానికి అదనపు వ్యయం కూడా తప్పదు. మరి 815 మంది ఎంపీలు ఉంటే ప్రభుత్వ ఖజానాపై ఎంత భారం పడుతుంది? ఆ వివరాలు తెలుసుకుందాం.

545 నుంచి 815కు.. ఎంతమంది ఎంపీలు పెరుగుతారు?

ప్రస్తుతం లోక్సభలో 543 మంది ఎన్నికైన సభ్యులకు ప్రాతినిధ్యం ఉంది. ప్రతిపాదిత 50 శాతం పెంపు అమలైతే ఈ సంఖ్య సుమారు 815కు చేరవచ్చు. అంటే దాదాపు 272 మంది ఎంపీలు అదనంగా వస్తారు. అయితే కొన్ని అంచనాల్లో ప్రస్తుత సంఖ్యను 545గా తీసుకుని 270 మంది పెరుగుతారని లెక్కిస్తున్నారు. ఇవి ప్రతిపాదిత పెంపుపై ఆధారపడిన అంచనాలు మాత్రమే. తుది సంఖ్య డీలిమిటేషన్ ప్రక్రియ, చట్టపరమైన నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ఈ మార్పు కేవలం లోక్సభకే పరిమితం కాకపోవచ్చు. రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను కూడా పునర్విభజించే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం ఉన్న సుమారు 4,123 అసెంబ్లీ స్థానాలు 6,185 నుంచి 6,186 వరకు పెరిగే అవకాశం ఉందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అసెంబ్లీ స్థానాల పెంపుపై ఇంకా తుది సంఖ్య ఖరారు కాలేదు.

ఒక్కో ఎంపీకి నెలకు ఎంత ఖర్చవుతుంది?

ఎంపీలకు ప్రభుత్వం కేవలం జీతం మాత్రమే చెల్లించదు. నియోజకవర్గ భత్యం, కార్యాలయ ఖర్చుల భత్యం కూడా అందిస్తుంది. 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చిన సవరించిన రేట్ల ప్రకారం ఒక్కో ఎంపీకి నెలకు అందే మొత్తం ఇలా ఉంటుంది.

- నెలసరి జీతం: రూ.1,24,000
- నియోజకవర్గ భత్యం: రూ.87,000
- కార్యాలయ ఖర్చుల భత్యం: రూ.75,000

ఈ మూడింటినీ కలిపితే ఒక్కో ఎంపీకి నెలకు రూ.2.86 లక్షలు అవుతుంది. ఈ మొత్తంలో కార్యాలయ నిర్వహణ, స్టేషనరీ, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న సహాయకుల సేవలకు సంబంధించిన ఖర్చులు కూడా ఉంటాయి. అంటే.. ప్రస్తుత సంఖ్యను 545గా తీసుకుని, కొత్తగా 270 మంది ఎంపీలు వస్తారని లెక్కిస్తే జీతాలు, నియోజకవర్గ భత్యాలు, కార్యాలయ భత్యాల రూపంలో ప్రభుత్వానికి అదనపు ఖర్చు పెరుగుతుంది. 270 మంది × రూ.2.86 లక్షలు = నెలకు సుమారు రూ.7.72 కోట్లు. అంటే ఏడాదికి సుమారు రూ.92.66 కోట్లు ఖర్చవుతుంది. ఇది కేవలం జీతాలు, రెండు రకాల భత్యాలకు సంబంధించిన అంచనా మాత్రమే. ఎంపీలకు కల్పించే ఇతర సౌకర్యాలు ఇందులో లేవు. ఇక, ఎంపీలకు పార్లమెంట్ సమావేశాలు లేదా విధులకు హాజరైన అర్హత కలిగిన రోజులకు రోజువారీ భత్యం కూడా చెల్లిస్తారు. ప్రస్తుతం ఈ మొత్తం రోజుకు రూ.2,500గా ఉంది. ఒకవేళ కొత్తగా వచ్చే 270 మంది ఎంపీలు ఏడాదికి 60 రోజుల పాటు ఈ భత్యానికి అర్హులైతే అదనంగా సుమారు రూ.4.05 కోట్లు ఖర్చవుతుంది. అయితే ఈ మొత్తం ఎంపీల హాజరు, సమావేశాల రోజులు, నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

కొత్త ఎంపీలకు ఇళ్లు, వసతి సౌకర్యాలు!

ఎంపీల సంఖ్య పెరిగితే ఢిల్లీలో వారికి ప్రభుత్వ నివాసాలు కేటాయించాల్సి ఉంటుంది. కొత్తగా వచ్చే ఎంపీల కోసం సుమారు 270 ఇళ్లు లేదా ఫ్లాట్లు అవసరమవుతాయి. వీటితో పాటు ఫర్నిచర్, మరమ్మతులు, విద్యుత్, నీరు, టెలిఫోన్, ఇతర సౌకర్యాలను కూడా కల్పించాలి. ఎంపీల సీనియారిటీ, అందుబాటులో ఉన్న వసతులను బట్టి నివాసాల కేటాయింపు ఉంటుంది. ఈ వసతుల నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చుపై ప్రస్తుతానికి ఏకరీతి అధికారిక అంచనా అందుబాటులో లేదు. ప్రతి ఎంపీకి ఢిల్లీలో, తన నియోజకవర్గంలో కార్యాలయాలు అవసరం. వీటి నిర్వహణకు సిబ్బంది, కంప్యూటర్లు, స్టేషనరీ, ఇతర పరికరాలు కావాలి. ఎంపీల సంఖ్య పెరిగితే పార్లమెంట్ సచివాలయంలోనూ అదనపు సిబ్బంది అవసరం ఏర్పడవచ్చు. పార్లమెంటరీ కమిటీలు, భద్రత, రికార్డుల నిర్వహణ, సాంకేతిక వ్యవస్థలు, సభా కార్యకలాపాలపై కూడా ఖర్చు పెరిగే అవకాశం ఉంది. అయితే ఎంపీల సంఖ్య 50 శాతం పెరిగిందని ఈ ఖర్చులన్నీ కూడా అదే నిష్పత్తిలో పెరుగుతాయని చెప్పలేం.

ఎంపీల్యాడ్స్ నిధుల రూపంలో మరో రూ.1,350 కోట్ల భారం?

ఎంపీల్యాడ్స్ (MPLADS) పథకం కింద ఒక్కో ఎంపీ తన నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ఏటా రూ.5 కోట్ల వరకు నిధులను సిఫార్సు చేయవచ్చు. ప్రస్తుతం ఈ పథకం కింద ప్రతి ఎంపీకి ఏడాదికి రూ.5 కోట్ల కేటాయింపు ఉంది. ఈ పథకం కొత్త ఎంపీలకూ యథాతథంగా వర్తిస్తే, అదనంగా వచ్చే 270 మంది ఎంపీల కోసం ఏడాదికి రూ.1,350 కోట్ల మేర అభివృద్ధి నిధులు అవసరమవుతాయి. అయితే ఇది ఎంపీల వ్యక్తిగత జీతం లేదా ఆదాయం కాదు. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు వినియోగించాల్సిన ప్రభుత్వ నిధులు మాత్రమే. అంతేకాదు.. ఎంపీల సంఖ్య పెరిగినంత మాత్రాన ఎన్నికల నిర్వహణ ఖర్చులు కూడా అదే స్థాయిలో పెరుగుతాయని చెప్పలేం. ఎన్నికల ఖర్చులో ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఎన్నికల సిబ్బంది వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే అదనపు నియోజకవర్గాల ఏర్పాటు, వాటి సరిహద్దుల నిర్ణయం, ఎన్నికల రికార్డుల నిర్వహణ, పరిపాలనా పనుల కోసం కొంత అదనపు వ్యయం అవసరమవుతుంది.

డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు ఎంత ఖర్చు?

నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కమిషన్ ఛైర్మన్, సభ్యుల జీతభత్యాలు, కార్యాలయ నిర్వహణ, సిబ్బంది, ఇతర పరిపాలనా ఖర్చులను కేంద్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. డీలిమిటేషన్ ప్రక్రియలో ఎన్నికల సంఘానికి వచ్చే అదనపు ఖర్చులు కూడా ఉంటాయి. అయితే కమిషన్ ఏర్పాటు, మొత్తం ప్రక్రియకు అయ్యే వ్యయంపై ముందుగానే కచ్చితమైన అంచనా వేయడం కష్టం. 202627 కేంద్ర బడ్జెట్లో పార్లమెంట్ ఉభయ సభల నిర్వహణ కోసం మొత్తం రూ.1,492 కోట్లు కేటాయించారు. ఇందులో లోక్సభకు రూ.1,009 కోట్లు, రాజ్యసభకు రూ.482.99 కోట్లు కేటాయించారు.

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

అక్రిడిటేషన్ ఉన్నవారికి ఎక్కువ రక్షణ ఉండాలా? పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

జర్నలిస్టుగా ఉండటానికి అర్హులెవరు, నిరసనల కు సంబంధించిన వార్తల కవరేజీ సమయంలో ప్రభుత్వ గుర్తింపు (అక్రిడిటేషన్) పొందిన మీడియా వ్యక్తులకు 'స్వయంప్రకటిత విలేకరుల' (సెల్ఫ్ ప్రొక్లెయిమ్డ్ జర్నలిస్టులు) కంటే ఎక్కువ రక్షణ ఉండాలా అనేవి పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. పాత్రికేయుల స్వేచ్ఛను, శాంతిభద్రతల నిర్వహణను సమతౌల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం గురువారం పేర్కొంది. అక్టోబరు 10, 11 తేదీల్లో దిల్లీలో నిరసన ప్రదర్శనల వార్తలు కవర్ చేయడానికి వెళ్లినవారిలో ఏడుగురు జర్నలిస్టులపై దౌర్జన్యం చేసి, నిర్బంధించిన విషయాన్ని పరిశీలించాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి అప్పగించింది.

''పిటిషనర్లు తమవద్ద ఉన్న సమాచారాన్ని ఆ కమిటీకే అందజేయాలి. కేసులో పేర్కొన్న పాత్రికేయులు ఆ రోజు ఆ సమయంలో అక్కడే ఉన్నారా, వారిపై దౌర్జన్యం జరిగిందా, శాంతిభద్రతల నిర్వహణకు అవసరమైనదానికంటే ఎక్కువ స్థాయిలో వారిపై బలప్రయోగం చేశారా అనేది కమిటీ చూస్తుంది'' అని ధర్మాసనం పేర్కొంది. అక్రిడిటేటెడ్ పాత్రికేయులకు ఉన్నంత రక్షణ సెల్ఫ్ ప్రొక్లెయిమ్డ్ జర్నలిస్టులకు ఉండకపోవచ్చని జస్టిస్ బాగ్చీ చెప్పారు. నిరసనల వేదిక వద్ద నుంచి పాత్రికేయుల్ని బలవంతంగా తరలించారని, ఘటనల్ని రికార్డు చేయనివ్వకుండా అడ్డుకున్నారని కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, దిల్లీ జర్నలిస్టుల యూనియన్ తమ పిటిషన్లలో తెలిపాయి.అక్రిడిటేషన్ కార్డుల్ని చూపిస్తున్నా పట్టించుకోకుండా ఈడ్చుకుపోయి దురుసుగా ప్రవర్తించారని ఆరోపించాయి. పెద్ద మీడియా సంస్థల్లో పనిచేస్తున్న ఏడుగురు పాత్రికేయులు దీనిలో ఉన్నారని, వారేమీ రీళ్లు చేసుకునేవారు కాదని సీనియర్ న్యాయవాది పి.వి.దినేశ్ తెలిపారు. గుర్తింపు పొందినవారిని ఇలా కస్టడీలోకి తీసుకోపచ్చా అని ప్రశ్నించారు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లకు, పాత్రికేయులకు మధ్య తేడా ఉండాల్సిందేనని దిల్లీ పోలీసులు ఇదివరకు ప్రమాణపత్రంలో పేర్కొన్నారు. ఈడీ కేసుల వివాద పరిష్కారంలో న్యాయ వ్యవస్థ ప్రతినిధినీ చేర్చాలనగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) పరిధిలోకి వచ్చే ఆస్తుల జప్తుతో ముడిపడిన ఈడీ కేసుల వివాద తుది పరిష్కార ప్రక్రియలో న్యాయవ్యవస్థ ప్రతినిధినీ చేర్చాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తీవ్ర పరిణామాలుండే ఈ కేసుల్లో నిర్ణయాలు నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా ఉండాలంటే ఈ తరహా ఏర్పాటు తప్పనిసరి అంటూ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల తో కూడిన ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఏకసభ్య ధర్మాసనానికి అనుమతిస్తున్న 2009 సవరణను రద్దు చేసి బహుళ వివాద పరిష్కార వ్యవస్థలున్న పాత విధానాన్ని అనుసరించే విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.పీఎంఎల్ఏ కింద ఆస్తుల జప్తు కేసులు భారీగా పెరగడం, 180 రోజుల్లోగా తీర్పులు వెలువరించాలనే నిబంధన విధించడంతో వివాద పరిష్కార వ్యవస్థలపై ఒత్తిడి అధికం కావడాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. 2012 మార్చి 31 నుంచి ఇప్పటి వరకూ 3,639 కేసుల్లో ఆస్తుల జప్తునకు ఆదేశాలు వెలువడిన విషయాన్ని ప్రస్తావించింది. దిల్లీ, కలకత్తా, తెలంగాణ హైకోర్టులు వెలువరించిన తీర్పులపై దాఖలైన అప్పీళ్లకు సంబంధించి తాజా నిర్ణయాన్ని సుప్రీం ధర్మాసనం వెలువరించింది. పీఎంఎల్ఏ కేసుల్లో ఏకసభ్య వివాద పరిష్కార ధర్మాసనాల నిర్ణయాలను హైకోర్టులు సమర్థించడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు.

మరదే చైనా బజారంటే.. ట్రంప్ పర్యటన వేళ విచ్చలవిడిగా ఎన్విడియా చిప్స్ సేల్

నేషనల్ బ్యూరో (మనసులో మాట):

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటే చైనాకు బొత్తిగా భయం లేనట్లుంది. అమెరికా నుంచి స్మగ్లింగ్ చేసిన చిప్స్‌ను షెన్‌జెన్ నగరంలో వ్యాపారులు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. అది కూడా అమెరికా అధ్యక్షుడు ఆ నగర పర్యటనలో ఉండగానే.. ఎటువంటి బెరుకు లేకుండా అమ్మకాలు సాగించారు. ఓ అమెరికా విలేకరికి కూడా ఎన్విడియా అత్యాధునిక చిప్స్ అమ్ముతామని ఆఫర్ చేయడం గమనార్హం.అమెరికాచైనా మధ్య కొన్నేళ్లుగా సిలికాన్ యుద్ధం జరుగుతోంది. అత్యాధునిక చిప్స్ చైనాకు చేరకుండా చేయాలని అమెరికా ఎంత ప్రయత్నించినా.. సఫలం కాలేకపోతోంది. ఏదో ఒక మార్గంలో చైనా వాటిని సంపాదిస్తోంది. ఈ అంశంపై అమెరికా గుర్రుగా ఉంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏపీఈసీ సదస్సు కోసం చైనాలోని టెక్ కేంద్రమైన షెన్‌జెన్ నగరంలో పర్యటించారు. అప్పటికే చైనా మహిళతో ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ బంధం బహిర్గతమైంది.

ఆంక్షలు విధించినా..?

అమెరికా మీడియా ప్రతినిధి ఒకరు ట్రంప్‌జిన్‌పింగ్ చర్చల వేదికకు కొంత దూరంలో ఉన్న మార్కెట్‌కు వెళ్లారు. అక్కడ ఓ వ్యాపారి సదరు విలేకరికి ఎన్విడియా బ్లాక్‌వెల్ బీ300 చిప్స్‌ను అమ్మేందుకు సిద్ధమయ్యాడు. వాస్తవానికి ఆ చిప్స్‌ను చైనాకు విక్రయించకూడదని 2024లోనే అమెరికా ఆంక్షలు విధించింది. ఇక షెన్‌జెన్‌కు చెందిన ఓ వ్యాపారి 8 బ్లాక్‌వెల్ బీ300 చిప్స్ ఉన్న సర్వర్‌కు 3 మిలియన్ డాలర్లు కోట్ చేశాడు. మరో అలాంటి సర్వర్‌కే వ్యాపారి 33.4 మిలియన్ డాలర్ల ధర చెప్పాడు.అమెరికా ఆంక్షల కారణంగా ధరలు పెరిగాయని సదరు వ్యాపారి వెల్లడించాడు. రెండు నెలల క్రితం అదే సర్వర్ 2 మిలియన్ డాలర్లకే లభించేదన్నాడు. ఇక అమెరికాలో బీ300 సర్వర్లు 5 లక్షల డాలర్ల నుంచి 6 లక్షల డాలర్ల మధ్యలో ధర పలుకుతాయి.ఈ చిప్స్ కోసం స్టార్టప్ వ్యవస్థాపకులు, డెవలపర్లు, విదేశీయులు ఈ మార్కెట్‌పైనే ఆధారపడుతుంటారు. తాము రష్యా, ఇరాన్ దేశాలకు ఎన్విడియా చిప్స్ ఎగుమతి చేసినట్లు ఓ వ్యాపారి వెల్లడించాడు.తమకు డబ్బు చెల్లిస్తే.. కస్టమర్ ఏ దేశానికి చెందిన వాడో పట్టించుకోమని తెలిపాడు.ఇక ఎన్విడియాలోని అత్యాధునిక ఉత్పత్తులైన ఆర్టీఎక్స్ 5090, ఆర్టీఎక్స్ ప్రో 6000 చిప్స్‌ను షెన్‌జెన్ మార్కెట్లో బహిరంగానే ప్రదర్శిస్తున్నట్లు సదరు అమెరికా విలేకరి గుర్తించాడు. అమెరికా ఎంత ప్రయత్నించినా చిప్స్ స్మగ్లింగ్‌ను ఆపలేకపోతోందనే విషయం ఈ ఘటనతో స్పష్టమవుతోంది.



భారత సరిహద్దులో పరిస్థితి స్థిరంగా ఉంది: చైనా



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

భారత్ చైనా సరిహద్దులో పరిస్థితి సాధారణంగా, స్థిరంగా ఉందని చైనా సైన్యం గురువారం వెల్లడించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సుబన్సిరి ప్రాంతంలో చైనా సైనికుల కదలిక నేపథ్యంలో ఇరు దేశాల ఉన్నత స్థాయి సైనికాధికారులు నెల రోజులపాటు చర్చలు జరిపినట్లు సమాచారం. ఇరు దేశాలు దౌత్య, సైనిక మార్గాల ద్వారా నిరంతర సంప్రదింపులు జరుపుతున్నాయని చైనా రక్షణ శాఖ ప్రతినిధి సీనియర్ కల్నల్ చెన్ షీ తెలిపారు. సరిహద్దుల్లో ప్రశాంతతను కాపాడేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. అయితే అరుణాచల్‌ప్రదేశ్‌ను భారత్‌లో భాగంగా గుర్తించబోమని చైనా మరోసారి తన వైఖరిని వెల్లడించింది. మరోవైపు భారత్ జపాన్ రక్షణ సహకారంపై కూడా చైనా అసంతృప్తి వ్యక్తం చేసింది.

అమెరికా సుంకాలను ఖండించిన చైనా

హాంకాంగ్:

చైనా, జపాన్‌లతో సహా అమెరికాతో వాణిజ్య భాగస్వామ్యం కలిగివున్న అనేక దేశాలు ట్రంప్ యంత్రాంగం తాజాగా విధించదలచిన సుంకాలకు వ్యతిరేకంగా నిరసన ప్రకటించాయి. బుధవారం ప్రకటించిన ఈ సుంకాలు వచ్చే సంవత్సరం ప్రారంభం నుంచి అమలులోకి రానున్నాయి. గత సంవత్సరం ట్రంప్ యంత్రాంగం భారీగా సుంకాలు విధించినా అమెరికా సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగా వాటిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. భారత్‌తో పాటు 14 దేశాలు అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలు ఆయా దేశాల్లో అధికోత్పత్తికి, చవకైన ఉత్పాదన కుz దారితీసి తమ ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నాయని ఆ విషయంపై విచారణ జరిపిన అమెరికా వాణిజ్య ప్రతినిధి జామియెసన్ గ్రీర్ పేర్కొన్న నేపథ్యంలో మళ్లీ సుంకాలు విధించాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన చైనాపై దీనికింద 20 శాతం సుంకాలు విధించాలని ప్రతిపాదించారు. అధిక ఉత్పాదక సామర్థ్యం కలిగివున్నామన్న కారణంగా తమపై సుంకాలు విధించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. ''రాజకీయ వ్యూహంలో భాగంగా చైనాపై నింద మోపే ఎత్తుగడను వ్యతిరేకిస్తున్నాం'' అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ తెలిపారు. సుంకాల యుద్ధాలు, వాణిజ్య యుద్ధాలు ఎవరికీ ప్రయోజనం కలిగించవని ఆయన అన్నారు. తమపై 15 శాతం సుంకాలు విధించాలన్న అమెరికా నిర్ణయాన్ని జపాన్ ఖండించింది. సింగపూర్, మలేషియా తదితర దేశాలు కూడా అమెరికా విధానాన్ని తూర్పారబట్టాయి. డెమోక్రట్ల మండిపాటు వాణిజ్య యుద్ధాలతో అట్టుడుకుతున్న వేళ మిత్రదేశాలపై ట్రంప్ యంత్రాంగం సుంకాలు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన సెనెటర్ చక్ షూమర్ తాజా సుంకాలపై స్పందిస్తూ ''డొనాల్డ్ ట్రంప్ ఎప్పటికీ తన తప్పుల నుంచి గుణపాఠాలు నేర్చుకోరు. అమెరికన్ కుటుంబాలపై భారం మోపుతూ.. కార్మికులకు ఉపయోగపడని నిర్ణయాలు తీసుకొంటున్నారు.అసలు షరతులు నిర్ణయించే అధికారం చైనాకే ఇస్తున్నారు.జనవరిలో ఈ పరిస్థితి మారుతుంది'' అని పేర్కొన్నారు.

బిహార్ ఎమ్మెల్యే కుమార్తె పెళ్లి.. లక్షల మంది అతిథులు...పది కి.మీ. ట్రాఫిక్ జామ్



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

బిహార్ ఎమ్మెల్యే అనంత్ సింగ్ తన కుమార్తె పెళ్లిని ఎన్నికల బహిరంగ సభను తలపించేలా చేశారు. లక్షల మంది అతిథులు, వందలాది వంటవాళ్లు... పది కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్‌ల మధ్య అనంత్‌సింగ్ కుమార్తె శివాంగి సింగ్ వివాహం బుధవారం జరిగింది. ఈ పెళ్లికి నాలుగు లక్షల ఆహ్వాన పత్రాలు అచ్చువేశారు. పెళ్లికి రండని గ్రామాలకు గ్రామాలనే ఆహ్వానించారు.లక్షల మంది అతిథుల కోసం 150 రకాల వంటకాలు చేశారు. పెళ్లి వంటకాల కోసం కొన్ని వారాల పాటు సన్నాహాలు జరిగాయి. అతిథులకు వినోదం కల్పించేందుకు గుర్రపు పందేలు ఏర్పాటు చేశారు. ఇందులో విజయం సాధించిన వారికి ఒక థార్ కారును బహుమతిగా ప్రకటించారు. పందేలు చూడటానికి లక్షలాది మంది ఎగబడ్డారు. ఇసుకవేస్తే రాలనంత స్థాయిలో రద్దీ పెరిగిపోవడంతో వందలాది మంది పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు ఎక్కి పందేలు వీక్షించారు.జనాన్ని నియంత్రించడం అసాధ్యంగా మారడంతో పందేల ఫైనల్స్ వాయిదా వేయాల్సి వచ్చింది. పెళ్లికి వచ్చేవారితో రహదారులు నిండిపోయాయి. దాదాపు పదికిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయినట్లు స్థానికులు తెలిపారు. చరిత్రలో గుర్తుండిపోయేలా కుమార్తె పెళ్లిని అంగరంగ వైభవంగా నిర్వహించిన అనంత్ సింగ్ బిహార్‌లోని మొకామా శాసనసభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే. ఈ నియోజకవర్గం నుంచి ఆయన పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. జనతా దళ్ (యునైటెడ్) నుంచి ఇటీవలే బహిష్కారానికి గురైన అనంత్‌సింగ్ ప్రస్తుతం స్వతంత్ర సభ్యునిగా కొనసాగుతున్నారు.

ముస్లింకు ప్రాధాన్యం ఇంతేనా?: ఒవైసీ



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో, ముస్లింలకు తగినంత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో భాజపా, ఎస్పీ విఫలయ్యాయని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తప్పు బట్టారు. గురువారం లఖ్‌నవూలో 'సామాజిక్ పరివర్తన్ మోర్చా' తొలి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యూపీలో మూడోసారి అధికారంలోకి రాకుండా భాజపాను అడ్డుకోవడంలో విపక్షాలు ఏకతాటిపై కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛ, న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు రాజ్యాంగం ఇచ్చిన భరోసాకు విరుద్ధంగా ఆరెస్సెస్ పని చేస్తోందని ఆరోపించారు. బుల్డోజర్లు, ఎన్‌కౌంటర్ల ద్వారా న్యాయం లభించదని, చట్టబద్ధ పాలనను పునరుద్ధరించాలని చెప్పారు. తమ కూటమి నెగ్గితే ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) నేత, నగీనా ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ సీఎం అవుతారని ప్రకటించారు.

మూకడ్రోన్ల పాలిట సింహస్వప్నం భార్గవాస్త్ర!



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

పరస్పరం సమన్వయంతో వ్యవహరిస్తూ మూకదాడి చేయగల శత్రు డ్రోన్లను నేలకూల్చడానికి స్వదేశీ పరిజ్ఞానంతో 'భార్గవాస్త్ర' సిద్ధమైంది. తాజాగా దీన్ని రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో విజయవంతంగా పరీక్షించారు. ఇది వాహనంపై మోహరించే వీలున్న రెండంచెల డ్రోన్ విధ్వంసక వ్యవస్థ. ఇందులో అన్‌గైడెడ్ రాకెట్లు, కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగల మైక్రో మిసైల్స్ ఉంటాయి. ఆధునిక యుద్ధరంగంలో పెను ముప్పుగా మారిన డ్రోన్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఇదో ముందడుగు. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది. ఏకకాలంలో అనేక లక్ష్యాలను ఛేదించగల సత్తా దీని సొంతం. ఇది డ్రోన్లతోపాటు ఆయుధాలు ప్రయోగించగల మానవరహిత విమానాలు (యూఏవీలు), లాయిటరింగ్ మ్యునిషన్లనూ నేలకూల్చగలదు.'హార్డ్‌కిల్' విధానాన్ని భార్గవాస్త్ర అనుసరిస్తుంది. అంటే.. కమ్యూనికేషన్ సంకేతాలు, నేవిగేషన్ వ్యవస్థలను అడ్డుకోవడం వంటి విధానాలకు బదులు డ్రోన్‌ను నేరుగా కూల్చివేస్తుంది. అందువల్ల కమ్యూనికేషన్ లింక్‌లను విచ్ఛిన్నం చేసినా పనిచేసే స్వయంప్రతిపత్తి డ్రోన్ల ఆటలు దీని ముందు సాగవు. దీని రాడార్.. 10 కిలోమీటర్ల పరిధి వరకూ శత్రు డ్రోన్లను గుర్తించగలదు. దీనికితోడు ఎలక్ట్రోఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్ నిఘా వ్యవస్థ, ప్యాసివ్ రేడియో ఫ్రీక్వెన్సీ సెన్సర్లు ఉన్నాయి. ఈ పరిజ్ఞానాలు డ్రోన్లను గుర్తించడంతోపాటు వాటి కదలికలను ఎప్పటికప్పుడు నిశితంగా గమనించడం, ముప్పు స్థాయిని వర్గీకరించడం వంటివి చేయగలవు. దీని కమాండ్, కంట్రోల్ సెంటర్.. మెదడులా వ్యవహరిస్తుంది. భిన్న సెన్సర్ల నుంచి వచ్చే సమాచారాన్ని విశ్లేషించి, శత్రు డ్రోన్లను గుర్తిస్తుంది.

ఆవేశ ప్రకటనలు కాదు.. పని చూడండి



* యూపీ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడికి ఖర్గే అక్షింతలు

లఖ్‌నవూ (మనసులో మాట):

ఉద్రేకపూరితంగా ప్రకటనలు చేసే బదులు ఉమ్మడిగా పనిచేయడంపై దృష్టి సారించాలని ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎంపీ ఇమ్రాన్ మసూద్‌ను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశించారు. యూపీ శాసనసభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుకు సంబంధించి దూకుడుగా మాట్లాడుతున్నందుకు అక్షింతలు వేశారు. గురువారం రాజ్యాంగ రక్షా సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో, ఇతర చర్చావేదికల్లోనైనా మసూద్ ఆవేశంగా మాట్లాడతారని, ప్రస్తుత ఎన్నికల తరుణంలో కావాల్సింది మాత్రం ఉమ్మడిగా పనిచేయడమేనని చెప్పారు. సీట్ల సర్దుబాటు చర్చలు కొనసాగుతుండగా అభ్యర్థుల్ని ప్రకటిస్తుండటంపైతాము సంకీర్ణ భాగస్వాములమా, భిక్షగాళ్లమా అని మసూద్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఖర్గే జోక్యం చేసుకున్నారు. సర్ ప్రక్రియపై డిసెంబరు 12న భోపాల్‌లో, 19న అహ్మదాబాద్‌లో, జనవరి 15న కోల్‌కతాలో ర్యాలీలు నిర్వహించాలని ఇండియా కూటమి నిర్ణయించింది.

జర్నలిస్టుగా ఉండటానికి అర్హులెవరు?



* అక్రిడిటేషన్ ఉన్నవారికి ఎక్కువ రక్షణ ఉండాలా?
* పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు

దిల్లీ (మనసులో మాట):

జర్నలిస్టుగా ఉండటానికి అర్హులెవరు, నిరసనలకు సంబంధించిన వార్తల కవరేజీ సమయంలో ప్రభుత్వ గుర్తింపు (అక్రిడిటేషన్) పొందిన మీడియా వ్యక్తులకు 'స్వయంప్రకటిత విలేకరుల' (సెల్ఫ్ ప్రొక్లెయిమ్డ్ జర్నలిస్టులు) కంటే ఎక్కువ రక్షణ ఉండాలా అనేవి పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. పాత్రికేయుల స్వేచ్ఛను, శాంతిభద్రతల నిర్వహణను సమతౌల్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనల ధర్మాసనం గురువారం పేర్కొంది. అక్టోబరు 10, 11 తేదీల్లో దిల్లీలో నిరసన ప్రదర్శనల వార్తలు కవర్ చేయడానికి వెళ్లినవారిలో ఏడుగురు జర్నలిస్టులపై దౌర్జన్యం చేసి, నిర్బంధించిన విషయాన్ని పరిశీలించాలని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి అప్పగించింది.''పిటిషనర్లు తమవద్ద ఉన్న సమాచారాన్ని ఆ కమిటీకే అందజేయాలి. కేసులో పేర్కొన్న పాత్రికేయులు ఆ రోజు ఆ సమయంలో అక్కడే ఉన్నారా, వారిపై దౌర్జన్యం జరిగిందా, శాంతిభద్రతల నిర్వహణకు అవసరమైనదానికంటే ఎక్కువ స్థాయిలో వారిపై బలప్రయోగం చేశారా అనేది కమిటీ చూస్తుంది'' అని ధర్మాసనం పేర్కొంది. అక్రిడిటేటెడ్ పాత్రికేయులకు ఉన్నంత రక్షణ సెల్ఫ్ ప్రొక్లెయిమ్డ్ జర్నలిస్టులకు ఉండకపోవచ్చని జస్టిస్ బాగ్చీ చెప్పారు. నిరసనల వేదిక వద్ద నుంచి పాత్రికేయుల్ని బలవంతంగా తరలించారని, ఘటనల్ని రికార్డు చేయనివ్వకుండా అడ్డుకున్నారని కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, దిల్లీ జర్నలిస్టుల యూనియన్ తమ పిటిషన్లలో తెలిపాయి.గుర్తింపు పొందినవారిని ఇలా కస్టడీలోకి తీసుకోపచ్చా అని ప్రశ్నించారు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లకు, పాత్రికేయులకు మధ్య తేడా ఉండాల్సిందేనని దిల్లీ పోలీసులు ఇదివరకు ప్రమాణపత్రంలో పేర్కొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా బర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

దేశీయ మార్కెట్లో ఇటీవల భారీగా దిగొచ్చిన బంగారం, వెండి ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, దేశీయంగా కొనుగోళ్లతో ఈ లోహాలకు మళ్లీ డిమాండ్ పెరిగింది. దీంతో హైదరాబాద్ విపణిలో శుక్రవారం 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల పసిడి ధర రూ.1,28,500 పలికింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.1600పైన పెరిగింది. ఇక, కేజీ వెండి ధర రూ.1,56,100గా ఉంది. క్రితం రోజుతో పోలిస్తే వెండి రూ.5000 పైనే ఎగబాకింది.అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 3628 డాలర్లుగా ఉంది. స్పాట్ సిల్వర్ ఔన్సు ధర 43.48 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాముల ధర రూ.1.23లక్షలు, సిల్వర్ ఫ్యూచర్స్ ధర రూ.1.51లక్షలుగా ట్రేడ్ అవుతోంది. డిసెంబరులో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు అంచనాలు ఉన్నప్పటికీ డాలర్ విలువ క్షీణిస్తోంది. సాధారణంగా బంగారం లావాదేవీలు డాలర్ల రూపేణ జరుగుతాయి. డాలర్ విలువ తగ్గుతుండటంతో ఇతర దేశాల కొనుగోలుదారులు పసిడి కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు, ఇటీవల బంగారం ధర భారీగా దిగిరావడంతో కనిష్ఠాల వద్ద కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో దేశీయంగానూ ఈ లోహాలకు డిమాండ్ ఊపందుకుంది. ఈ పరిణామాలన్నీ బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని బులియన్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్‌లో యాపిల్ విక్రయ కేంద్రం



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

ప్రముఖ సాంకేతిక సంస్థ యాపిల్ తన తొలి రిటెయిల్ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించనుంది. కూకట్‌పల్లిలోని లేక్‌షోర్ వైజంక్షన్ మాల్‌లో వచ్చే నెల 10న 'యాపిల్ కూకట్‌పల్లి' పేరుతో ఈ స్టోర్ అందుబాటులోకి రానుంది. దేశంలో కంపెనీకి ఇది ఏడో రిటెయిల్ స్టోర్. దక్షిణాదిలో తన కార్యకలాపాలను మరింత విస్తరించడంలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ స్టోర్‌లో ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్, ఐఫోన్ ఫ్యూయో, ప్రోఎక్స్‌డీఆర్ డిస్‌ప్లే, టచ్‌తో కూడిన మ్యాక్‌బుక్ ప్రో, యాపిల్ వాచ్ సిరీస్ 12, అల్ట్రా 4 సహా కంపెనీ ఉత్పత్తులన్నీ అందుబాటులో ఉంటాయి. ఉత్పత్తులను ప్రత్యక్షంగా పరిశీలించి కొనుగోలు చేయడంతోపాటు, కంపెనీ సేవలు, సాంకేతిక సహాయాన్నీ వినియోగదారులు నేరుగా పొందొచ్చని కంపెనీ తెలిపింది. ఇప్పటికే హైదరాబాద్‌లో యాపిల్‌కు పరిశోధనాభివృద్ధి కేంద్రం, రిటెయిల్ కస్టమర్ కేర్ బృందాలు ఉన్నాయి. తాజా స్టోర్‌తో నగరంలో కంపెనీ ఉనికి మరింత బలోపేతం కానుంది. ప్రస్తుతం దేశంలో ముంబయి, దిల్లీఎన్‌సీఆర్, బెంగళూరు, పుణెల్లో ఆరు స్టోర్లను యాపిల్ నిర్వహిస్తోంది.

నిఫ్టీ 29,000 పాయింట్లకు!



* వచ్చే ఏడాది చివరకు చేరొచ్చు
* వరుస మూడు సమీక్షల్లో 0.25% చొప్పున పెంపునకు అవకాశం

నేషనల్ బ్యూరో (మనసులో మాట):

వచ్చే ఏడాది ముగిసేసరికి నిఫ్టీ50 సూచీ 12 శాతం పెరిగి 29,000 పాయింట్లకు చేరొచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ జేపీ మోర్గాన్ అంచనా వేసింది. డిసెంబరు, ఫిబ్రవరి, ఏప్రిల్ పరపతి సమీక్షల్లో 0.25% చొప్పున ఆర్‌బీఐ కీలక రేట్లను పెంచే అవకాశం ఉందని పేర్కొంది. కార్పొరేట్ ఆదాయాలు పుంజుకోవడం, ముడిచమురు ధరలు తగ్గడం, దేశీయ రుణాల వృద్ధి, ప్రైవేట్ మూలధన వ్యయాలు వంటి అంశాలు మార్కెట్‌ను నడిపించొచ్చని తెలిపింది.

కంపెనీల ఆదాయాలు పెరుగుతాయ్..

చౌక చమురు ధరలు, స్థిర కరెన్సీ కలిసి దిగుమతి వ్యయాలను తగ్గిస్తాయి. దీని వల్ల కార్పొరేట్ మార్జిన్లు, ఆదాయాలకు మద్దతు లభిస్తుంది. లిస్టెడ్ కంపెనీల్లో ముఖ్యంగా చిన్న కంపెనీలు, విధానపరమైన మద్దతున్న సంస్థల్లో వ్యయాలు 202627 ప్రథమార్ధంలో 25% మేర పెరుగుతున్నాయి. ఎమ్ఎస్‌సీఐ ఇండియా సూచీలోని కంపెనీల ఆదాయం 2026లో 12 శాతం వృద్ధి చెందొచ్చని, 2027లో ఇది 14 శాతానికి చేరొచ్చని అంచనా కడుతోంది.

8వ వేతన కమిషన్ అమలుతో..

8వ వేతన కమిషన్ అమలు కారణంగా 1.2 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల చేతిలో 202829 వరకు రూ.7.2 లక్షల కోట్లు ఉంటాయి. 2027లో ఏడు రాష్ట్రాల ఎన్నికలకు ముందు సంక్షేమ వ్యయాలు పెరగవచ్చు. అంతే కాకుండా, 202930 కల్లా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ స్థూల విలువలో 20 శాతానికి చేరొచ్చు. దీని వల్ల వ్యవసాయం, తయారీ.. రెండింటికీ మద్దతు లభిస్తుంది. ఇవన్నీ మార్కెట్లో ద్రవ్యలభ్యత(లిక్విడిటీ)ను పెంచే అంశాలే.

లాభాలకు కళ్లెం వేసినా..

ఇప్పటికే భారీగా పెరిగిన షేర్ల విలువలకు తోడు దేశీయంగా విధానపరమైన అడ్డంకులు, కొనసాగుతున్న అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా లాభాలు పరిమితంగా ఉండొచ్చు. దీని వల్ల ఎంపిక చేసిన, రిస్క్ తక్కువగా ఉన్న షేర్ల వైపు మదుపర్లు చూడొచ్చు. అయితే ఏఐ కంపెనీలు ఎక్కువగా ఉన్న మార్కెట్లతో భారత్ పోటీపడడం లేదు కాబట్టి సానుకూలతలూ లేకపోలేదు. ఏఐ పెట్టుబడులు తగ్గించుకోవాలనుకున్న వారు భారత మార్కెట్ల వైపు చూస్తారని జేపీ మోర్గాన్ అంటోంది. ఇప్పటిదాకా తరలివచ్చిన విదేశీ పెట్టుబడులే అందుకు నిదర్శనమని పేర్కొంది.

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో 340 మందికి లేఆఫ్!

నేషనల్ బ్యూరో (మనసులో మాట):

స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగం ఇన్‌స్టామార్ట్ 340 మంది ఉద్యోగులను ఇంటికి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది. ఏఐ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి వృద్ధి కోసం పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా వీరిని తొలగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కార్పొరేట్, సపోర్ట్ విభాగాల్లో పనిచేసేవారిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం ఉండబోతోందని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. క్విక్ కామర్స్ విభాగంలో తీవ్రమైన పోటీ ఎదురవుతున్న వేళ ఈ పునర్‌వ్యవస్థీకరణ చేపట్టడం గమనార్హం.క్విక్‌కామర్స్ విభాగంలో రోజురోజుకూ పోటీ తీవ్రతరం అవుతోంది.ఎటర్నల్ బ్లింకిట్, జెప్టోతో పాటు ఇకామర్స్ సంస్థలైనఫ్లిప్‌కార్ట్,అమెజాన్‌కు చెందిన.. ఫ్లిప్‌కార్ట్ మినిట్స్,అమెజాన్ నౌ నుంచి ఇన్‌స్టామార్ట్‌తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి ప్రకటించినఫలితాల్లోభారీనష్టాలను ఇన్‌స్టామార్ట్ నమోదు చేసింది. అంతకుముందు త్రైమాసికంతో రూ.778 కోట్లుగా ఉన్న నష్టం రూ.895 కోట్లకు పెరిగింది.

ఎప్పుడు ఏమవుతుందో.. దేశానికి 165 టన్నుల బంగారం తెచ్చిన ఆర్బీఐ..!



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, ఫారెక్స్ విలువల్లో భారీ కుదుపులతో భారత్ అప్రమత్తమైంది. విదేశాల్లోని వాల్ట్‌లలో ఉంచిన బంగారాన్ని (Gold) వేగంగా స్వదేశానికి చేరుస్తోంది. సెప్టెంబర్ 2025 నుంచి సెప్టెంబర్ 2026 వరకు ఏకంగా 165 టన్నుల బంగారాన్ని తీసుకొచ్చేసింది. దీంతో దేశీయంగా ఆర్బీఐ (RBI) వద్ద పుత్తడి నిల్వలు 65.4% (575.82 టన్నులు) నుంచి 84% (740.13 టన్నులు)కు పెరిగాయి. భారత్ వద్ద దేశీయంగా, విదేశీ వాల్ట్‌లలో భద్రపర్చిన మొత్తం స్వర్ణ నిల్వలు ఏడాది క్రితం 880.18 టన్నులు. అయితే తాజాగా స్వల్పంగా పెరిగి 880.52 టన్నులుగా ఉన్నాయి. గత ఆరు నెలల్లోనే విదేశాల నుంచి 60 టన్నులు వెనక్కి తెచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ వద్ద 140.39 టన్నుల భారత్ బంగారం ఉంది.ఇక మన విదేశీ మారకద్రవ్య నిల్వల్లో పుత్తడి వాటా గతేడాది సెప్టెంబర్‌లో 13.92% ఉండగా.. ఈ ఏడాది మార్చి నాటికి అది 16.70%కు చేరింది. కానీ, సెప్టెంబర్ నాటికి స్వల్పంగా తగ్గి 14.38%గా ఉంది.

విదేశాల్లో ఎందుకు నిల్వ చేయడం..

1990ల్లో ఫారెక్స్ సంక్షోభం వేళ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో బంగారం తాకట్టు పెట్టి 405 మిలియన్ డాలర్ల లోన్ తీసుకొంది. ఆ రుణాన్ని 1991 నవంబర్‌లోనే తిరిగి చెల్లించాం. కానీ, రవాణా విషయంలో కొన్ని కారణాలతో ఆ బంగారాన్ని అదే బ్యాంక్‌లో ఉంచేశాం. ఇలా ఉంచిన బంగారాన్ని చెల్లింపులు, వాణిజ్యం, స్వాప్ చేయడానికి తేలిగ్గా వాడవచ్చు. దీంతోపాటు భారత్ అంతర్జాతీయ మార్కెట్లో బంగారం కొనుగోలు చేసి.. విదేశాల్లోనే నిల్వ చేస్తుంది. వీటిని సర్టిఫికెట్ల రూపంలో తన వద్ద ఉంచుకుంటుంది.

ప్రపంచ బంగారం వ్యాపారానికి లండన్ కేంద్రం. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద వివిధ దేశాలకు చెందిన బంగారు ఇటుకలను భద్రపరుస్తారు. ఆ దేశాల కేంద్ర బ్యాంక్‌లు ఈ బంగారాన్ని స్వాప్ చేసి విదేశీ కరెన్సీలు తీసుకొంటుంటాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఆధీనంలో 4,00,000 బంగారు ఇటుకలు ఉన్నాయి.

ఆ ఘటనతో ఉలిక్కిపడ్డ భారత్..

ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక పశ్చిమ దేశాలు రష్యాపై చర్యలు మొదలుపెట్టాయి. తమ వద్ద ఉన్న దాని బంగారం సహా ఆస్తులను స్తంభింపజేశాయి. ఈ ఘటన భారత్‌ను ఆలోచనలో పడేసింది. విదేశీ ప్రభుత్వాల చేతిలో జాతీయ ఆస్తులను ఉంచడం క్షేమం కాదని భావించి.. తిరిగి స్వదేశానికి తీసుకురావడం ప్రారంభించింది. 2023 నాటికి భారత్ వద్ద మొత్తం 794.63 టన్నుల పుత్తడి ఉండగా.. దానిలో 493.54 టన్నులు విదేశాల్లోనే ఉంది. అయితే ఆ తర్వాత నుంచి దేశీయంగా నిల్వలు పెంచేందుకు ఆర్బీఐ చర్యలు చేపట్టింది.

నిల్వల్లో భారత్ ఏ స్థానంలో ఉంది..?

వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నవంబర్ లెక్కల ప్రకారం భారత్ 881 టన్నుల బంగారంతో 8వ ర్యాంక్‌లో ఉంది. ఈ జాబితాలో అమెరికా 8,133 టన్నులతో తొలిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత జర్మనీ (3,349 టన్నులు), ఇటలీ (2,452), ఫ్రాన్స్ (2,437), చైనా (2,410), రష్యా (2,264), స్విట్జర్లాండ్ (1,040) ఉన్నాయి.

'సైబర్ బీమా'కు పెరుగుతున్న గిరాకీ



* ఏఐ దాడులు, డేటా చోరీలతో రక్షణకు ప్రాధాన్యం

హైదరాబాద్ (మనసులో మాట):

దేశంలో డిజిటల్ కార్యకలాపాలు విస్తరిస్తున్న కొద్దీ, సైబర్ దాడుల ముప్పు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత సైబర్ బీమా మార్కెట్ వచ్చే అయిదేళ్లలో 2.32.8 రెట్లు విస్తరించనుందని ఆర్థిక సేవల సంస్థ డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. 202425లో 115255 మిలియన్ డాలర్లు (రూ.1,067రూ.2,367 కోట్లు)గా ఉన్న ఈ మార్కెట్, 203031 నాటికి 321594 మిలియన్ డాలర్ల (రూ.2,980 5,515 కోట్లు)కు చేరొచ్చని 'డిఫెండింగ్ ది డిజిటల్ ఇన్సూరర్' నివేదికలో పేర్కొంది. ఏటా 1819% వృద్ధి నమోదవుతోందని తెలిపింది.

సమాచారం పెరుగుతోంది

దేశంలో డిజిటల్ చెల్లింపులు, క్లౌడ్‌సేవలు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఆర్థిక సేవల వినియోగం అధికమవుతోంది. దీంతో వ్యక్తిగత ఆర్థిక సమాచారం భారీగా డిజిటల్ వ్యవస్థల్లోకి చేరుతోంది. ఒక సంస్థలో భద్రతా లోపం తలెత్తినా, దాని ప్రభావం క్లౌడ్ సేవలు, చెల్లింపుల వ్యవస్థల ద్వారా ఇతర సంస్థలకూ విస్తరించే ప్రమాదం ఉంది. సీఈఆర్‌టీఇన్ గణాంకాల ప్రకారం దేశంలో సైబర్ భద్రతా ప్రమాదాలు 202324లో 20 లక్షల మేర జరగ్గా, 2024 25లో 29 లక్షలకు పెరిగాయి.

కొత్త తరహా దాడులు

కృత్రిమ మేధ (ఏఐ) సైబర్ దాడుల స్వరూపాన్ని మార్చేస్తోంది. ఆటోమేటెడ్ ఫిషింగ్ దాడులు 1,200 శాతానికి పైగా పెరిగాయి. నకిలీ గుర్తింపులు, డీప్‌ఫేక్‌లు, ఫిషింగ్, ఖాతాల స్వాధీనం, రాన్సమ్‌వేర్ ద్వారా సంస్థలు, వినియోగదారులను మోసగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. 2026 మార్చి నుంచి ఆగస్టు మధ్య భారత ఆర్థిక రంగంలో 116 డేటా సంబంధిత ఘటనలు నమోదయ్యాయి. వీటిలో 46 డేటా ఉల్లంఘనలు, 37 డేటా లీకేజీలు, 33 క్రెడిట్ కార్డులకు సంబంధించిన ఘటనలు ఉన్నాయి. సైబర్ బీమా క్లెయిముల్లో 70 శాతానికి పైగా డేటా ఉల్లంఘనల అనంతర చర్యలు, ఘటనల నిర్వహణకు సంబంధించినవేనని నివేదిక తెలిపింది.

పెద్ద సంస్థల్లో పెరుగుతున్న కవరేజీ

భారత్‌లో సైబర్ బీమా కవరేజీ పరిమితులు గత మూడేళ్లలో ఏటా 1617%పెరిగాయి.కొన్ని పెద్ద బ్యాంకులు 202526లో తమ బీమా పరిమితులను దాదాపు రెట్టింపు చేసుకున్నాయి. ఒక్కో సంస్థకు 50100 మిలియన్ డాలర్ల (రూ.464 928 కోట్ల) వరకు ఈ కవరేజీ ఉంది. పెద్ద ఐటీ, సాంకేతిక సేవల సంస్థలు 200300 మిలియన్ డాలర్ల (రూ.1,857రూ.2,785 కోట్ల) వరకూ బీమా రక్షణ తీసుకుంటున్నాయి.

మారుతున్న అంచనాలు..

గతంలో జరిగిన నష్టాల ఆధారంగా మాత్రమే బీమా ప్రీమియాలను నిర్ణయించడం ఇక సరిపోదని డెలాయిట్ సూచించింది. రియల్‌టైమ్ సైబర్ ముప్పు సమాచారం, వినియోగదారుల ప్రవర్తనా గణాంకాలు, ఏఐ ఆధారిత విశ్లేషణతో రిస్కును అంచనా వేయాలి. మోటార్ బీమాలో దొంగతనాన్ని నిరోధించే పరికరాలను పరిశీలించి ప్రీమియం నిర్ణయించినట్లే.. సైబర్ బీమాలోనూ సంస్థల భద్రతా ప్రమాణాలు, మూడో పక్షంపై ఆధారపడటం,

భద్రతకు మూడంచెల విధానం..

సంస్థలు సైబర్ దాడులపై పూర్తి అవగాహనతో ఉండాలని నివేదిక సూచించింది. డిజిటల్ వ్యవస్థల రక్షణ, ఏఐ ఆధారిత నిరంతర పర్యవేక్షణ, సంస్థాగత స్థాయిలో సైబర్ ముప్పు నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఐఆర్‌డీఏఐ సమాచార, సైబర్ భద్రతా మార్గదర్శకాలు, డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం (డీపీడీపీ) ఐటీ చట్టంలోని నిబంధనలను పాటించాలి.

ఉద్యోగులకు షాక్.. 10వేల మందికి లేఆఫ్..?



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోతలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా జర్మనీకి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎస్ఏపీ (SAP) భారీ లేఆఫ్‌లకు సిద్ధమవుతోంది. 10 వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు యోచిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఏఐకి అనుగుణంగా కంపెనీని పునర్‌వ్యవస్థీకరించేందుకే ఈ చర్య చేపడుతున్నట్లు సమాచారం. కంపెనీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం సిబ్బందిలో ఈ ప్రతిపాదిత తొలగింపుల సంఖ్య 9% కావడం గమనార్హం. తుది అంకె ఇంకా ఖరారు కాలేదని తెలుస్తోంది. ఉద్యోగులతో చర్చలు పూర్తైన తర్వాత ఇది మారవచ్చు. ప్రొడక్ట్, ఇంజినీరింగ్, సేల్స్ విభాగాలలో ఈ కోతలు ఉండే అవకాశం ఉంది. SAP ఐరోపాలోనే అత్యంత విలువైన సాఫ్ట్‌వేర్ కంపెనీ. కంపెనీ సీఈవో క్రిస్టియన్ క్లైయిన్ ఏఐ ఫస్ట్ వ్యూహం అమలుకు తీవ్రంగా యత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం కంపెనీ ఎగ్జిక్యూటివ్ బోర్డును కూడా రెండు సార్లు పునర్ వ్యవస్థీకరించారు.ఫలితంగా ఆరుగురు సభ్యుల బోర్డు నుంచి ఇద్దరు వైదొలగారు. కోతలకు అవకాశం ఉన్న పోస్టులను గుర్తించాలని కంపెనీ ఇప్పటికే అన్ని విభాగాలకు సందేశం పంపింది. ఇప్పటికే ప్రొడక్ట్ విభాగం చీఫ్‌గా ఉన్న ముహమ్మద్ ఆలమ్ కాంట్రాక్ట్ పునరుద్ధరణ యత్నాలు చేయకపోవడంతో.. ఆ విభాగ బాధ్యతలను సీఈవోనే స్వీకరించారు. మార్చి నాటికి ఆలమ్ గడువు ముగుస్తుంది.

క్రెడిట్ కార్డులతో తెగ కొనేశారు



* డెబిట్ కార్డులతో పోలిస్తే 6 రెట్లు అధికంగా కొనగోళ్లు

నేషనల్ బ్యూరో (మనసులో మాట):

డెబిట్ కార్డుల ద్వారా జరిగిన కొనుగోళ్ల విలువ కంటే అక్టోబరులో క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన వ్యయాలు 6 రెట్లు ఎక్కువగా నమోదయ్యాయి. ఏటీఎం నగదు ఉపసంహరణలు కూడా క్రెడిట్ కార్డులతో సమానంగా ఉండటం గమనిస్తే డిజిటల్ చెల్లింపులతో పాటు నగదు వినియోగం కూడా బాగానే కొనసాగుతోందని అర్థమవుతోంది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసిన ఏటీఎం, చెల్లింపుల మౌలిక సదుపాయాలు, కార్డు లావాదేవీల నెలవారీ గణాంకాల ప్రకారం, అక్టోబరులో క్రెడిట్ కార్డుల ద్వారా సుమారు రూ.2.45 లక్షల కోట్ల కొనుగోళ్లు జరగగా, డెబిట్ కార్డుల ద్వారా రూ.40,492 కోట్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. ఏటీఎంలు, పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) టెర్మినల్స్ వద్ద జరిగిన నగదు ఉపసంహరణలు రూ.2.33 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి.

ఆన్‌లైన్ లావాదేవీలే అధికం

క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోళ్లలో ఆన్‌లైన్ లావాదేవీలదే పైచేయిగా ఉంది. వీటి ద్వారా రూ.1.54 లక్షల కోట్ల కొనుగోళ్లు జరగ్గా, పీఓఎస్ టెర్మినల్స్ వద్ద కొనుగోళ్లు రూ.90,562 కోట్లుగా నమోదయ్యాయి. ఇతర క్రెడిట్ కార్డు లావాదేవీల విలువ రూ.119 కోట్లుగా ఉంది. డెబిట్ కార్డుల ద్వారా కొనుగోళ్లు పీఓఎస్ టెర్మినల్స్ వద్ద రూ.24,957 కోట్లుగా ఉండగా, ఆన్‌లైన్ లావాదేవీలు రూ.15,284 కోట్లుగా నమోదయ్యాయి. ఇతర డెబిట్ కార్డు లావాదేవీల విలువ రూ.251 కోట్లుగా ఉంది.

ఏటీఎంల వద్ద నగదు ఉపసంహరణలూ ఎక్కువే..

మొత్తం నగదు వినియోగంలో ఏటీఎంల వద్ద డెబిట్ కార్డుల ద్వారా జరిగిన ఉపసంహరణలే ప్రధాన వాటాను కలిగి ఉన్నాయి. 42.04 కోట్ల లావాదేవీల ద్వారా రూ.2.32 లక్షల కోట్లకు పైగా నగదును విత్‌డ్రా చేశారు. ఏటీఎంల వద్ద క్రెడిట్ కార్డుల ద్వారా నగదు ఉపసంహరణలు రూ.415 కోట్లుగా ఉండగా, ఓఎస్ టెర్మినల్స్ వద్ద డెబిట్ కార్డులను ఉపయోగించి నగదు తీసుకోవడం రూ.1.27 కోట్లతో నామమాత్రంగా ఉంది.

భారత బ్యాంకుల రుణ వృద్ధికి



నేషనల్ బ్యూరో (మనసులో మాట):

వచ్చే ఏడాది భారతీయ బ్యాంకులు రెండంకెల రుణ వృద్ధిని కొనసాగిస్తాయని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. పెరుగుతున్న వ్యయ సామర్థ్యం వల్ల లాభదాయకతకు, స్థిరమైన మూలధనానికి మద్దతు లభిస్తుందని వెల్లడించింది. బలమైన ఆర్థిక వృద్ధి కారణంగా రుణ వృద్ధి సుమారు 15 శాతం వద్ద ఆశాజనకంగా ఉంటుందని పేర్కొంది. విధాన రేటులో స్వల్ప పెరుగుదల నికర వడ్డీ మార్జిన్లు, ఆదాయాలకు మద్దతు ఇవ్వడం వల్ల 2028 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో భారతీయ బ్యాంకుల ఆర్థిక పని తీరు స్థిరంగా ఉంటుందని ఫిచ్ అంచనా వేసింది.

కొత్త మొండి బకాయిలు స్వల్పంగా పెరగొచ్చు..

రుణాలు పాతవయ్యే కొద్దీ ఆస్తుల నాణ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని, నిరంతర రికవరీలు, రైటాఫ్‌లు దాన్ని భర్తీ చేస్తాయని ఆసియా పసిఫిక్ బ్యాంకులపై విడుదల చేసిన నివేదికలో ఫిచ్ పేర్కొంది. ఇటీవలి సంవత్సరాల్లో వేగవంతమైన రుణ వృద్ధి కారణంగా హామీ లేని వ్యక్తిగత రుణాలు, వ్యవసాయ, వ్యాపార రుణాలు వంటి కొన్ని విభాగాల్లో కొత్త నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఎల్) స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 202627లో 0.6 శాతంగా అంచనా వేసిన క్రెడిట్ వ్యయాలు, స్థూల రుణాల్లో 0.8 శాతానికి పెరుగుతాయని ఫిచ్ అంచనా వేసింది. 202728లో ఎన్‌పీఎల్ నిష్పత్తి 2 శాతం కంటే తక్కువగా ఉండొచ్చని పేర్కొంది.

రెండో త్రైమాసికంలో వృద్ధి 7.6%: ఇండ్-రా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627) రెండో త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి 7.6 శాతానికి పెరగొచ్చని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్‌రా) అంచనా వేసింది. పెట్టుబడుల వృద్ధి దోహదపడొచ్చని తెలిపింది. ఏడాది క్రితం రెండో త్రైమాసికంలో వృద్ధి 8.1 శాతంగా, 202627 ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో 7.8 శాతంగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాలను 7.1 శాతం నుంచి 7.2 శాతానికి పెంచింది.

మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక



ఆస్ట్రేలియాను చిత్తు చేసిన
ఇంగ్లండ్



బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడా-తో(డీఎల్ఎస్ పద్ధతి) ఘన విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 16.5 ఓవర్లలో కేవలం 108 పరుగులకే ఆలౌటైంది.

ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ ఐదు వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ (11 బంతుల్లో 22), సామ్ హార్పర్ (14 బంతుల్లో 26) మినహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు.

వర్షం అంతరాయం.. ఇంగ్లండ్ మెరుపు ఛేదనఅనంతరం స్వల్ప లక్ష్యం-తో బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు వరుణుడు అడ్డుపడ్డాడు. వర్షం కారణంగా మ్యాచ్ ఓవర్లను కుదించి, డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఇంగ్లండ్ లక్ష్యాన్ని 93 పరుగులగా సవరించారు. ఆసీస్ బౌలర్ రిలే మెరెడిత్ ఆరంభంలో మూడు వికెట్లు తీసి ఆతిథ్య జట్టులో ఆశలు రేపినప్పటికీ.. ఇంగ్లండ్ యువ బ్యాటర్లు జోర్డాన్ కాక్స్ (14 బంతుల్లో 33 నాటౌట్), అనెరిన్ డొనాల్డ్ (13 బంతుల్లో 32) ఆకాశమే హద్దుగా చెలరేగారు. వీరిద్దరి మెరుపు బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ 8.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసి విజయతీరాలకు చేరింది.

ముంబై ఇండియన్స్‌కు కొత్త కెప్టెన్
రోహిత్ శర్మ..



ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తిరిగి నియమితుడయ్యాడు. ఈ మేరకు ముంబై ఇండియన్స్ మేనెజ్‌మెంట్ ఎక్స్ వేదికగా అధి-కారిక ప్రకటన విడుదల చేసింది. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ కావడంతో రోహిత్‌కు తిరిగి జట్టు పగ్గాలను ఎంఐ యాజమాన్యం కట్టబెట్టింది. ముంబై కెప్టెన్‌గా రోహిత్‌కు అద్భుత-మైన ట్రాక్ రికార్డు ఉంది. రోహిత్ శర్మ సారథిగా ముంబై జట్టును ఐదుసార్లు చాంపియన్‌గా నిలిపాడు. అయితే 2024 సీజన్‌కు ముందు గుజరాత్ టైటాన్స్ నుంచి హార్దిక్ పాండ్యాను ట్రేడ్ చేసు-కున్న ముంబై యాజమాన్యం.. రోహిత్‌ను తప్పించి అతడికి పగ్గాలు అప్పగించింది. దీంతో ముంబై తీసుకున్న నిర్ణయంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమమయ్యాయి. అయినప్పటికీ హార్దిక్‌ను మూడు సీజన్ల పాటు ముంబై తమ కెప్టెన్‌గా కొనసాగించింది. కానీ హార్దిక్ సారథ్యంలో ముంబై ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిం-ది. గత మూడు సీజన్లలో కేవలం ఒక్కసారి మాత్రమే ముంబై ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఈ క్రమంలోనే ముంబై యాజమా-న్యం అతడిని పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ చేసి.. రోహిత్‌ను తిరిగి కెప్టె-న్‌గా నియమించింది. తిరుగు లేని నాయకుడుకాగా ముంబై ఇండియన్స్ చరిత్రలో రోహిత్ శర్మ ప్రయాణం ఒక సు-వర్ణాధ్యాయం. 2011లో ఒక సాధారణ ఆటగాడిగా జట్టులోకి అడుగుపెట్టిన రోహిత్.. ఆ ఫ్రాంచైజీని ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా తీర్చిదిద్దాడు. 2013, 2015, 2017, 2019, 2020 సీజన్లలో ముంబైని హిట్‌మ్యాన్ ఛాంపియన్‌గా నిలిపాడు. మళ్లీ ఇప్పడు ముంబైని ఆరో టైటిల్ లక్ష్యంగా నడిపించేందుకు రోహిత్ సిద్ధమ-య్యాడు

సచిన్ రికార్డు బద్దలు
కొట్టిన జైస్వాల్

క్రైస్ట్‌చర్చి వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌కు రాకముందే అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. అరంగేట్రం నుంచి వివిధ వేదికల్లో వరుసగా అత్యధిక టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా జైస్వాల్ నిలిచాడు. క్రైస్ట్‌చర్చి వేదికగా జరుగుతున్న మ్యాచ్ జైస్వాల్‌కు 33వది. ఈ నేపథ్యంలో వివిధ వేదికల్లో 32 టెస్టులు ఆడిన భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ క్రమంలో మరో భారత క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ (33 టెస్టులు) రికార్డును సమం చేశాడు. జైస్వాల్ తన 32వ మ్యాచ్‌ను వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో ఆడగా, సచిన్ కూడా తన 32వ మ్యాచ్‌ను న్యూజిలాండ్‌లోనే ఆడడం విశేషం. సెడాన్ పార్క్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ తొలి ఇన్నింగ్స్‌లో 43, రెండో ఇన్నింగ్స్‌లో 11 పరుగులు సాధించాడు. 2023లో అరంగేట్రం చేసినప్పటి నుంచి యశస్వి జైస్వాల్ టెస్టుల్లో తన విలువను చూపిస్తూనే వస్తున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన తన తొలి మ్యాచ్‌లో అతను 88.67 సగటుతో 266 పరుగులు సాధించాడు. స్వదేశంలో జైస్వాల్ సగటు 54.50 కాగా, విదేశీ టెస్టుల్లో అతని సగటు 42.67గా ఉంది. 2025లో జరిగిన భారత్‌దక్షిణాఫ్రికా సిరీస్ నుంచి శ్రీలంక సిరీస్ వరకు జైస్వాల్ ఆకట్టుకోలేదు. అయితే ఆ తర్వాత జరిగిన సిరీస్‌లలో అతను వరుసగా 20, 24, 25 సగటులను నమోదు చేశాడు. తాజాగా న్యూజిలాండ్ సిరీస్‌లో జైస్వాల్ తిరిగి ఫామ్ అందుకున్నాడు. ప్రస్తుతం, జైస్వాల్ ఈ ఫార్మాట్‌లో 7 సెంచరీలు, 14 హాఫ్ సెంచరీలు సాధించగా, అతను ఆడిన 32 టెస్ట్ మ్యాచ్‌లలో 48.16 సగటుతో 2697 పరుగులు చేశాడు.





తొలిరోజు ముగిసిన ఆట.. బుమ్రా ఖాతాలో చెత్త రికార్డు

క్రైస్ట్‌చర్చి వేదికగా న్యూజిలాండ్, భారత్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆట ముగిసింది. డే-1 స్టంప్స్ సమ-యానికి న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. టామ్ బ్లుండెల్ (53) అజేయ అర్ధశతకం సాధించగా, గ్లెన్ ఫిలిప్స్ (36) క్రీజులో ఉన్నారు.

అంతకముందు కెప్టెన్ టామ్ లాథమ్ (59) అర్ధసెంచరీ సాధించాడు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, వాషింగ్టన్ సుందర్ తలా ఒక వికెట్ పడగొట్టారు. తొలి రోజు ఆటలో ఒక సెషన్‌లో భారత బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించగా, రెండు సెషన్ల పాటు న్యూ-జిలాండ్ నిలకడైన బ్యాటింగ్ కొనసాగిం-చింది.

బుమ్రాకు దక్కని వికెట్‌బుమ్రా గత 38ఓవర్లుగా (తొలి టెస్టు, రెండో టెస్టు) వికెట్ తీయలేకపోయాడు. తొలి టెస్టులో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో తొలి ఓవర్‌లోనే వికెట్ తీసిన బుమ్రా ఆ తర్వాత 19 ఓవర్లలో మరో వికెట్ పడగొట్టలేక-పోయాడు. తాజాగా రెండో టెస్టులో 19 ఓవర్లు బౌలింగ్ చేసిన బుమ్రా 37 పరుగు-లిచ్చుకొని ఒక్క వికెట్ కూడా తీయలేక-పోయాడు.

ఈ నేపథ్యంలో బుమ్రా ఖాతాలో అనుకోని రికార్డు చేరింది. 2021 డబ్ల్యూ-టీసీ ఫైనల్ తర్వాత ఒక టెస్టు సిరీస్‌లో వికెట్ తీయకుండా ఎక్కువ ఓవర్లు వేయడం మళ్లీ ఇదే. ఆనాటి డబ్ల్యూటీసీ ఫైనల్లో బుమ్రా 36 ఓవర్లు వేసి ఒక్క వికెట కూడా తీయలేకపోయాడు. తాజాగా కివీస్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఇప్పటివరకు 38 ఓవర్లు వేసి వికెట్ లేమితో ఆ చెత్త రికార్డును అధిగమిం-చాడు.

తొలి సెషన్‌లో ఓపెనర్ల దూకుడుతొలి సెషన్‌లో న్యూజిలాండ్ ఓపెనర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. కాన్వే, టామ్ లాథమ్ కలిసి తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే గుర్నూర్ బ్రార్ కాన్వేను ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. రెండో సెషన్‌లో మాత్రం భారత బౌలర్లు విజృంభించారు. రెండో సెషన్ మనదే..హాఫ్ సెంచరీ సాధించిన టామ్ లాథమ్‌తో పాటు హెన్రీ నికోల్స్, రచిన్ రవీంద్ర వికెట్లు వెనువెంటనే పడ్డాయి. దీంతో న్యూజి-లాండ్ 4 వికెట్ల నష్టానికి 131 పరుగులతో టీ విరా-మానికి వెళ్లింది.



భారత్‌కు ఎదురుందా!

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ మహిళల హాకీ టోర్నీలో తిరు-గులేని విజయాలతో దూసుకెళ్తున్న భారత జట్టుకు సవాల్. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో సలీమా బృందం.. మలేసియా-తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టోర్నీలో వరుసగా అయిదు మ్యాచ్‌లు గెలిచి సెమీఫైనల్‌కు దూసుకొచ్చిన భారత్.. నాకౌ-ట్లోనూ అదే జోరు ప్రదర్శించాలనుకుంటోంది. లీగ్ దశలో 4-1తో మలేసియాను చిత్తు చేసిన భారత్‌కు ఆ జట్టును మరోసారి ఓడించడం పెద్ద కష్టం కాకపోవచ్చు. కానీ నాకౌట్ మ్యాచ్‌లో ఏ జట్టునూ తక్కువ అంచనా వేయలేం. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా.. నిష్క్రమణ తప్పదు. ఆఖరి నిమి-షాల్లో గోల్స్ ఇవ్వకపోవడం, వీలైనన్ని పెనాల్టీ కార్నర్లను సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం.

దీపిక సెప్రోవత్, నవ్‌నీత్ కౌర్, లాల్రెమ్‌సియామి, సలీమా రాణించడం భారత్‌కు కీలకం. వెటరన్ గోల్‌కీపర్ సవితా పునియా స్థానంలో జట్టులోకి వచ్చిన బిచు దేవి సత్తా చాటుతోంది. కీలక సేవ్‌లు చేస్తోంది. సెమీస్‌లోనూ ఆమె రాణించాలని భారత్ కోరుకుంటోంది. మరోవైపు థా-య్‌లాండ్‌పై చివరి లీగ్ మ్యాచ్‌లో 4-0తో గెలిచి సెమీస్‌కు వచ్చిన మలేసియా.. భారత్‌కు ఎలాంటి పోటీ ఇస్తుందో చూడాలి. మరో సెమీస్‌లో ఒలింపిక్ రజత పతక విజేత చైనాతో జపాన్ తలపడనుంది.

వైభవ్‌ను ఆడించనక్కర్లే.. కనీసం వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉంచితే చాలు: క్రిష్



రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో భారత కుర్రాడు వైభవ్ సూర్యవంశీ రికార్డుల ద్వి-శతకంతో అలరించాడు. వన్డేలను సైతం టీ20 మ్యాచులుగానే భావిస్తున్నట్లుగా అతడి బ్యాటింగ్ ఉంది. కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఈ క్రమంలో వైభవ్‌ను ముస్ముందు అన్ని ఫా-ర్మాట్లలోనూ ఆడించాలని మాజీ క్రికెటర్ క్రి-ష్ణమాచారి శ్రీకాంత్ సూచించారు. సింగిల్ హ్యాండ్‌తో మ్యాచులను గెలిపించే సత్తా అతడికి ఉందని వెల్లడించారు.

''వైభవ్ సూర్యవంశీ ఆల్ ఫార్మాట్ ప్లేయర్. ఇప్పటికిప్పుడు టెస్టుల్లో ఆడించకూడద-నుకుంటే సరే కానీ.. కనీసం స్క్వాడ్‌లో-నైనా అవకాశం కల్పించాలి. శ్రీలంక జట్టు మన దగ్గరకు రాబోతోంది. వన్డే సిరీస్‌ను ఆడనుంది. ఇందులో వైభవ్‌కు ఛాన్స్ ఇవ్వాలి. జట్టులోకి తీసుకోండి. ఒక్క మ్యా-చ్‌లోనైనా బరిలోకి దింపండి. వైభవ్‌ను మరింత వృద్ధిలోకి తీసుకురావాలని మీరు భావిస్తే మాత్రం.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జట్టులోకి తీసుకోవాలి. 15 మంది స్క్వా-డ్‌లో ఉంచాలి. ఏదొక రోజు అతడు ఒంటి-చేత్తో మ్యాచ్‌ను గెలిపిస్తాడు'' అని శ్రీకాంత్ వెల్లడించారు.

సన్ ఆఫ్ ది గాడ్ ఆఫ్ ది క్రికెట్..

''వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌ను చూస్తే.. కేవలం పవర్ మాత్రమే కాదు, టైమింగ్‌తో కూడిన ఆట ఉంది. అతడు గొప్ప ఆత్మవిశ్వా-సంతో ఆడతాడు. షాట్ల ఎంపిక విషయంలో ఏమాత్రం కలత చెందినట్లు కనిపించడు. ఏం చేయాలి? ఎలా చేయాలనే విషయాలపై వైభవ్‌కు స్పష్టత ఉంటుంది. అద్భుతమైన ప్లేయర్. ముందు 'గాడ్ ఆఫ్ ది క్రికెట్' సచిన్ వచ్చాడు. ఆ తర్వాత కింగ్ కోహ్లీ.. ఇప్పుడు వైభవ్ 'సన్ ఆఫ్ ది గాడ్ ఆఫ్ ది క్రికెట్'. ఇలాంటి ప్లేయర్‌ను ప్రోత్సహించకుండా.. అతడే వృద్ధిలోకి వస్తాడని చెప్పడం సరైంది-కాదు. ఇలాంటి తీరుతో ఓ నాణ్యమైన క్రికెటర్ భవిష్యత్తును నాశనం చేయొద్దు. టీమ్ మేనే-జ్‌మెంట్, సెలక్టర్లు దయ చేసి మేల్కొనాలి'' అని క్రిష్ణమాచారి శ్రీకాంత్ తెలిపాడు.

మనసులోమాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక



TA T10 లీగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా యంగ్ హీరోయిన్..

తెలుగు రాష్ట్రాల్లో టెన్నిస్ బాల్ క్రికెట్‌కు మరింత ఆదరణ తీసుకొచ్చే లక్ష్యంతో కొత్తగా ముందుకొస్తుంది TA T10 (తెలంగాణ ఆంధ్రప్రదేశ్ T10) లీగ్. తాజాగా ఈ లీగ్‌కు సంబంధించి ఆసక్తికరమైన అప్డేట్ వచ్చింది. ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా యంగ్ హీరోయిన్ సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు అధికారికంగా వెల్లడిస్తూ.. 'బిగ్గర్ విజన్.. ఇన్‌క్రెడిబుల్ టాలెంట్.. టెన్నిస్ బాల్ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం' అంటూ ఆమెకు ఘన స్వాగతం పలికారు.
సంయుక్త రాకతో లీగ్‌కు మరింత ప్రమోషన్ పెరగడంతో పాటు యూత్‌లో క్రికెట్‌పై ఆసక్తి పెరుగుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా టెన్నిస్ బాల్ క్రికెట్ అనేది గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని యువతకు ఎంతో ఇష్టమైన ఆట. సరైన అవకాశాలు, గుర్తింపు లేక ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు స్థానిక స్థాయికే పరిమితమవుతున్నారు. అలాంటి ఆటగాళ్లకు పెద్ద వేదిక కల్పించడం, వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం TA T10 ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఇక వరుస సినిమాలతో సందడి చేస్తున్న సంయుక్త బ్రాండ్ అంబాసిడర్‌గా బాధ్యతలు చేపట్టడంతో TA T10 లీగ్‌పై మరింత ఆసక్తి నెలకొంది.



ముంబైలో రజినీకాంత్.. 'ధర్మన్' షూటింగ్‌పై లేటెస్ట్ అప్డేట్!

యువ హీరోలకు గట్టి పోటినిస్తూ బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులు చేస్తున్నారు సూపర్ రజినీకాంత్. ఇటీవల జైలర్-2 తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఈయన.. ఇప్పుడు తనదైన స్టైల్, మాస్ యాక్షన్, అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో 'ధర్మన్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇదిలా ఉంటే..
తాజాగా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ వచ్చింది. ప్రస్తుతం 'ధర్మన్' చిత్రీకరణ ముంబైలో జరుగుతుండగా.. ఈ తాజా షెడ్యూల్‌లో రజినీకాంత్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

'ఆకాశంలో ఒక తార'పై కేటీఆర్ రివ్యూ

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా, పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఇప్పటికే ఈ సినిమాను వీక్షించిన పలువురు సినీ ప్రముఖులు చిత్రబృందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి, నాని సైతం ఈ సినిమాను మెచ్చుకున్నారు. తాజాగా ఈ జాబితాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేరారు.
'అసాధ్యమైన కలలు కనడం.. వాటిని నిజం చేసుకోవడం అనే అద్భుతమైన ఆశయంతో కూడిన కథ ఇది. 'ఆకాశంలో ఒక తార' చాలా అద్భుతంగా ఉంది. ఈ మధ్యకాలంలో ఇంత అందమైన సినిమా చూడలేదు. దుల్కర్ సల్మాన్, శ్రుతిహాసన్ ఎప్పటిలాగే అద్భుతంగా నటించారు. తొలి సినిమాతోనే సత్తా చాటిన సాత్విక రవళ్లి నటన తనను ఆకట్టుకుంది' అని కొనియాడారు. కాగా ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా బ్యానర్లపై సందీప్ గున్నం, రమ్య గున్నంనిర్మించారు. సాత్విక వీరవల్లి హీరోయిన్ కాగా.. శ్రుతి హాసన్, రుహాని శర్మ కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



ఆ సీక్రెట్ లీక్ చేస్తే డైరెక్టర్ నన్ను చంపేస్తారు!"

యువ సామ్రాట్ నాగచైతన్య, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న మైథికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ' విడుదలకు ముందే భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం కథపై ఇప్పటికే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాకు పార్ట్-2 ఉండేలా ఓపెన్ ఎండింగ్ ఉంటుందా అనే ప్రశ్నపై తాజాగా హీరోయిన్ మీనాక్షి చౌదరి తనదైన శైలిలో చమత్కారంగా స్పందించారు.
కథలోని కీలక మలుపులను ఇప్పుడే బయటపెట్టలేనని చెబుతూ.. "ఈ విషయంపై నేను ఎక్కువగా మాట్లాడితే డైరెక్టర్ నన్ను చంపేస్తారు" అంటూ ఆమె నవ్వుతూ వ్యాఖ్యానించారు.
ఆ సస్పెన్స్ అంతా డిసెంబర్ 4న థియేటర్లలోనే వీడుతుందని ఆమె ఆసక్తికర హింట్ ఇచ్చారు. మరోవైపు, ఈ చిత్రంలో తన పాత్రకు తాను సొంతంగా డబ్బింగ్ చెప్పుకోలేదని మీనాక్షి వెల్లడించారు. గతంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు తన గొంతునే వినిపించినప్పటికీ, 'వృషకర్మ' కోసం మాత్రం డబ్బింగ్ ఆర్టిస్ట్ వాయిస్‌ను వాడినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాబోయే ప్రాజెక్టులలోనైనా సొంతంగా డబ్బింగ్ చెప్పుకునే అవకాశం వస్తుందని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.
క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కథ, స్క్రీన్‌ప్లే అందించిన ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఇందులో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడిగా నటించగా, జయరామ్, సత్య, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.



మా ఇంట్లో ప్రేమంటే అదే.. పెళ్లిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన నటి

సినిమాల్లోని ప్రేమకథల్లో పెళ్లితో శుభం కార్డు పడటం సహజం. నిజ జీవితంలోనూ ప్రేమకు పెళ్లే గమ్యంగా భావిస్తానంటున్నారు బాలీవుడ్ నటి శర్వరి వాఘ్. సూరజ్ బర్జాత్యా దర్శకత్వంలో తెరకెక్కిన 'యే ప్రేమ్ మోల్ లియా' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రేమ, పెళ్లిపై శర్వరి తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సినిమాతో తొలిసారి పెళ్లికూతురి పాత్రలో కనిపించనున్న ఆమె.. తెరపై తనను అలా చూసి తల్లి భావోద్వేగానికి గురైన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ''నేను చాలా సంప్రదాయ కుటుంబంలో పెరిగాను. మా ఇంట్లో ప్రేమంటే పెళ్లి. ఒకరిని ప్రేమించినప్పుడు పెళ్లి దిశగా అడుగులు వేయాలి. ప్రేమకు పెళ్లే లక్ష్యం. వ్యక్తిగతంగా నేను కూడా అదే నమ్ముతాను'' అని శర్వరి పేర్కొన్నారు. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తన అక్క పెళ్లి జరిగిందని శర్వరి తెలిపారు. ''ఈ సినిమాలోనే తొలిసారి పెళ్లికూతురిగా నటించాను. షూటింగ్ సమయంలో మా అక్క పెళ్లి జరిగింది. తెరపై నన్ను పెళ్లికూతురిగా చూసి మా అమ్మ చాలా భావోద్వేగానికి గురైంది. అప్పటికే అక్క పెళ్లి చేసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇప్పుడు నన్ను కూడా అలా చూసేసరికి అమ్మకి కన్నీళ్లాగలేదు'' అని చెప్పారు. 'యే ప్రేమ్ మోల్ లియా'లో ఆయుష్మాన్ ఖురానాకు జోడీగా శర్వరి నటించారు. అనుపమ్ ఖేర్, సుప్రియా పాఠక్, సీమా పహ్వా, సౌమ్య టాండన్ ఇందులో కీలక పాత్రలు పోషించారు.

CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAOPUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/A2169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 08914540746